# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :26 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 23-03-2025 | పేజీలు:4 వెల: 2.00


## తెలంగాణలో ఆన్‌లైన్ గేమింగ్‌ను బ్యాన్

హైదరాబాద్,తెలంగాణలో ఆన్‌లైన్ గేమింగ్‌ను బ్యాన్ చేశారు. బెట్టింగ్ యాప్స్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్యపై సరైన క్లారిటీ లేదని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అడిషనల్ ఎస్పీ ప్రసాద్ అన్నారు. 2017 గేమింగ్ యాక్ట్ ప్రకారం తెలంగాణాలో ఆన్‌లైన్ గేమింగ్ బ్యాన్ అయింది.. మొత్తం 108 ఇల్లీగల్ యూఆర్ఎస్‌లను బ్లాక్ చేశాం.. చైనీస్ యూఆర్ఎల్‌లను ఫాలో కాకుండా అనేక ఇల్లీగల్ పంపుతున్నారు.. ప్రజలకు తమ మొబైల్స్ ద్వారా వచ్చే పాప్ అప్స్ పైనా సైబర్ క్రైమ్ కు ఫిర్యాదు చేస్తే వాటిని బ్లాక్ చేస్తామన్నారు. వేరు వేరు ప్రాంతల నుంచి ఫేక్ జీపీఎస్ ద్వారా జీయో ఫెన్సింగ్ యాక్సెస్ జరుగుతుంది.. స్కిల్ గేమింగ్ అని చెప్పే మాటలు అబద్ధం.. గేమింగ్ ద్వారా నష్టపోయిన ఒక్క గెమింగ్ కంపెనీ లేదని పేర్కొన్నారు. అయితే, గేమింగ్ కంపెనీ ఏర్పాటు– చేసిన సాఫ్ట్ వేర్ వారు పన్నిన పన్నాగం మాత్రమే.. స్కిల్ గేమ్స్, ఆన్‌లైన్ గేమ్స్ కు దూరంగా ఉండాలి అని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అడిషనల్ ఎస్పీ ప్రసాద్ సూచించారు. స్కిల్ గేమ్, నాన్ స్కిల్ గేమ్స్ తో సంబంధం లేదు.. ప్రతి గేమ్ వలన నష్టాలు ఉన్నాయి..

## మందబలంతో ప్రజాస్వామ్యాన్ని నడపలేరు



హైదరాబాద్,మార్చి22: కేంద్రం ప్రభుత్వం ఎప్పటి నుంచో కక్షపూరిత ధోరణితో దక్షిణాది రాష్ట్రాలపై అవలంబిస్తుందని మాజీమంత్రి కేటీఆర్ అన్నారు. ప్రజాస్వామ్యం మందబలం ఆధారంగా నడవరాదు అని పేర్కొన్నారు. చెన్నైలో జరిగిన దక్షిణ భారతదేశ రాష్ట్రాల పార్టీల సమావేశానికి కేటీఆర్ హాజరై మాట్లాడారు. కేసీఆర్ ఆధ్వర్యంలో 14ఏండ్ల పాటు తెలంగాణ ఉద్యమం నడిపించారని గుర్తుచేశారు. 14 సంవత్సరాల అనంతరం తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చుకున్నామని పేర్కొన్నారు. తమిళనాడు ప్రజలనుంచి అనేక అంశాలు స్ఫూర్తి తీసుకుంటామని తెలిపారు. అస్తిత్వం, హక్కుల కోసం కొట్లాడడంలో తమిళనాడు స్ఫూర్తిని చ్చిందన్నారు. ద్రవిడ ఉద్యమం సమైక్య దేశంలో తమ హక్కులు సాధించడానికి రాష్ట్రాలకు ఒక దిక్సూచీ లెక్క పని చేస్తుందన్నారు. డీలిమిటేషన్ వల్ల అనేక నష్టాలు, కేంద్ర ప్రభుత్వ వివక్షపూరిత విధానాలతో దక్షిణాది రాష్ట్రాలకు అనేక నష్టాలు కలుగుతాయని స్పష్టంచేశారు. మనమంతా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నా మని, ప్రజాస్వామ్యం మందబలం ఆధారంగా నడవరాదు అని పేర్కొన్నారు. దేశానికి 36 శాతం జీడీపీలో భాగస్వామ్యం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతున్నాయని పేర్కొన్నారు. డీలిమిటేషన్ కేవలం పార్లమెంట్ ప్రాతినిధ్యం తగ్గడమే కాదు.. ఆర్థికపరమైన నిధుల కేటాయింపుల్లో తీవ్రమైన నష్టం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. మొదటి నుంచి దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతుందన్నారు. ఎన్డీఏ పాలనలో దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష మరింత పెరిగిందన్నారు. వివక్షను కొనసాగించేందుకు డీలిమిటేషన్ అంశాన్ని ముందుకు తీసుకొస్తుందన్నారు. బుల్లెట్ రైలు వంటి ప్రాజెక్టులను ఉత్తరాదికే పరిమితం చేయడం ఒక ఉదాహరణ అని.. జనాభా దామాషా ప్రకారం డీలిమిటేషన్ జరిగితేనే దేశ సమాఖ్య స్ఫూర్తికే విఘాతం కలుగుతుంది అని కేటీఆర్ పేర్కొన్నారు.

## దక్షిణాదిని దెబ్బతీసే కుట్ర..ఆమోదయోగ్యం కాని డీలిమిటేషన్ వద్దు

చెన్నై,మార్చి22: డీలిమిటేషన్.. ఇప్పుడు దేశ వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది. ఎక్కడ విన్నా డీలిమిటేషన్ గురించే చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే.స్టాలిన్ సారథ్యంలో డీలిమిటేషన్‌పై చెన్నైలోని ఐటీసీ ఛోళా హోటల్‌లో దక్షిణాది రాష్ట్రాల సీఎంలు, విపక్షనేతలు సమావేశం అయ్యారు. దీంతో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు వాటిల్లే నష్టంపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి డీలిమిటేషన్ పై కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. జనాభాప్రాతిపదికన ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. దక్షిణాది ప్రాతినిధ్యం తగ్గించే ప్రయత్నాలను అడ్డుకోవాల్సి ఉందన్నారు. పన్నుల రూపంలో కేంద్రానికి రాష్ట్రాలు భారీగా చెల్లిస్తున్నా.. తక్కువ మొత్తంలోనే తిరిగి పొందుతున్నామని పేర్కొన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగనుందన్న విషయమై చర్చించేందుకు డీఎంకే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి రేవంత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. తెలంగాణలో వేగవంతమైన ఆర్థిక అభివృద్ధిని సాధించాం. జీఎస్‌డీపీ, తలసరి ఆదాయంలోనూ వృద్ధి సాధించాం. తెలంగాణలో సుపరిపాలనతోపాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. పన్నుల రూపంలో కేంద్రానికి భారీగా చెల్లిస్తున్నా.. తక్కువ మొత్తంలో తిరిగి పొందుతున్నాం. రూపాయి చెల్లిస్తే.. తమిళనాడుకు 26 పైసలు తిరిగొస్తున్నాయి. కర్ణాటకకు 16 పైసలు, తెలంగాణకు 42 పైసలు, కేరళకు 49 పైసలు మాత్రమే లభిస్తున్నాయి. కానీ, బిహార్ మాత్రం రూపాయికి రూ. 6.06 పొందుతోంది. యూపీకి రూ. 2.03, మధ్యప్రదేశ్‌కు రూ. 1.73 మేర లభిస్తోందని రేవంత్‌రెడ్డి వివరించారు. ఆర్థికంగా,రాజకీయంగా రాణిస్తున్న రాష్ట్రాలకు రాజకీయ పరిమితులు విఘాతం సృష్టిస్తాయి. డీలిమిటేషన్.. రాష్ట్రాల మధ్య రాజకీయ అసమానత్వం తీసుకువస్తుంది. పారదర్శకంగా లేని ఈ విధానంపై భాజపాను కట్టడి చేయాల్సి ఉందని హెచ్చరించారు లోక్‌సభ సీట్లు పెంచవద్దు..



రాష్ట్రాల్లో అంతర్గత డీలిమిటేషన్ చేపట్టాలి. 1976లో లోక్‌సభ సీట్లు పెంచకుండానే డీలిమిటేషన్ చేపట్టారు. ప్రధాని మోదీ కూడా లోక్‌సభ సీట్లు పెంచకుండా దీనిని చేపట్టాలని రేవంత్ కోరారు. కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దీనివల్ల కలిగే విపరిణామాలను చర్చించాల్సి ఉందన్నారు. న్యాయబద్ధం కానీ డీలిమిటేషన్ పై మనం బీజేపీని అడ్డుకోవాలి.. ఇది రాజకీయ అసమానతలకు దారి తీస్తుంది.. వాజ్ పేయి కూడా లోక్ సభ సీట్లు– పెంచకుండానే డీలిమిటేషన్ చేశారు.. నరేంద్ర మోదీ కూడా అదే పని చేయాలి.. లోక్ సభ సీట్లు పెంచకూడదు.. జనాభా ప్రతిపదికన నియోజకవర్గ పునర్విభజన దక్షిణాది అంగీకరించదు.. దక్షిణాదిలో కుటుంబ నియంత్రణను సమర్థంగా అమలు చేశామని అన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో కుటుంబ నియంత్రణ అమలు కాలేదు.. ఆర్థిక అభివృద్ధి, జీడీపీ, ఉద్యోగ కల్పనలో దక్షిణాది ముందుంది.. దేశానికి దక్షిణాది ఇచ్చేది ఎక్కువ.. మనకు తిరిగి వచ్చేది తక్కువ..డీలిమిటేషన్ రాజకీయంగా దక్షిణాదిని పరిమితం చేస్తుంది.. బాగా పని చేసిన మనకు శిక్ష వేస్తారా అని సీఎం రేవంత్ కేంద్రాన్ని ప్రశ్నించారు.

## సీట్లు తగ్గితే మన వాయిస్ కూడా తగ్గుతుంది

చెన్నై,మార్చి22: జనాభా ఆధారిత పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు చట్టాల రూపకల్పనలో ప్రాతినిధ్యం తగ్గుతుందని తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్ ఆరోపించారు. సొంత దేశంలోనే మనం రాజకీయ అధికారాన్ని కోల్పోయిన పౌరులుగా మిగిలిపోతామని అన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగనుందన్న విషయమై చర్చించేందుకు డీఎంకే ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం శనివారం ప్రారంభమైంది. ఇందులో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడారు. డీలిమిటేషన్‌పై ఈ అఖిలపక్ష భేటీ చరిత్రాత్మకంగా నిలిచిపోతుందని స్టాలిన్ అన్నారు. ప్రస్తుతం ఉన్న జనాభా ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన జరగకూడదు. దీన్ని మనమంతా వ్యతిరేకించాలని సూచించారు. పార్లమెంట్‌లో మన ప్రాతినిధ్యం పడిపోతే.. అభిప్రాయాలను వ్యక్తీకరించే బలం తగ్గుతుందని గుర్తించాలని అన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు వచ్చే నిధుల కోసం మనం పోరాటం చేయాల్సి వస్తుంది. మన సమ్మతితో సంబంధం లేకుండానే చట్టాలు రూపొందుతాయి. ఆ నిర్ణయాలు మన ప్రజలపై ప్రభావం చూపుతాయి. విద్యార్థులు అవకాశాలు కోల్పోవాల్సి వస్తుంది. రైతులకు మద్దతు కొరవడుతుంది. మన సంప్రదాయాలు, వృద్ధి ప్రమాదంలో పడతాయి. సామాజిక న్యాయం దెబ్బతింటుంది. ఈ పరిణామాలన్నింటితో మన సొంత దేశంలోనే మనం రాజకీయ అధికారాన్ని కోల్పోయిన పౌరులుగా మిగిలిపోతామని స్టాలిన్ వ్యాఖ్యానించారు. తమ నిరసన పునర్విభజనకు వ్యతిరేకంగా కాదని స్టాలిన్ ఈ సందర్భంగా వెల్లడించారు. న్యాయబద్ధంగా, పారదర్శంగా డీలిమిటేషన్ చేయాలనే తాము డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ.. జనాభా పెరుగుదలను అరికట్టేందుకు కొన్ని



దశాబ్దాలుగా పలు దక్షిణాది రాష్ట్రాలు కీలక చర్యలు చేపడుతున్నాయని అన్నారు. ఇందుకోసం అనేక విధానాలు కూడా తీసుకొచ్చాం. కానీ, కొన్ని రాష్ట్రాల్లో మాత్రం జనాభా వృద్ధి విపరీతంగా ఉంది. జనాభా నియంత్రణపై మన చర్యలకు ఎలాంటి రివార్డ్ లభించ లేదు సరికదా.. ఇప్పుడు రాజకీయ ప్రాతినిధ్యం కోల్పోయే ప్రమాదంలో పడ్డామని అన్నారు. ఈ సమావేశంలో తమిళనాడు, ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ, పంజాబ్, ఒడిశా రాష్ట్రాలకు సంబంధించిన నేతలంతా హాజరయ్యారు. తెలంగాణ కాంగ్రెస్ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, బీఆర్ఎస్ తరపున కేటీఆర్, మాజీ ఎంపీ వినోద్, రాజ్యసభ ఎంపీలు పాల్గొన్నారు. ఇక కేరళ నుంచి ముఖ్యమంత్రి విజయన్, పంజాబ్ నుంచి ముఖ్యమంత్రి భగవంత్ మాన్, కర్ణాటక నుంచి డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ హాజరయ్యారు. ఏపీ నుంచి పార్టీల ప్రతినిధులు ఈ సమావేశానికి డుమ్మా కొట్టారు. అలాగే బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కూడా గైర్హాజరయ్యారు.

## జవాబుదారీతనం లేని ఎయిండియా...



ముంబై,మార్చి22: ఎయిర్ ఇండియా విమానంపై ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే అసహనం వ్యక్తంచేశారు. తాను ప్రయాణించాల్సిన విమానం కోసం గంటకు పైగా వేచి చూడాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా విమానయాన సంస్థలు జవాబుదారీతనంతో వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర పౌర విమానయాన శాఖను కోరారు. ఈమేరకు ఆమె ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ఎయిర్ ఇండియా విమానాలు నిరంతరం ఆలస్యం అవుతున్నాయి. మేము ప్రీమియం ఛార్జీలు చెల్లిస్తాం. అయినప్పటికీ విమానాలు సమయానికి చేరుకోవు. దీని కారణంగా పిల్లలు, వృద్ధులతో సహా అనేకమంది ఇబ్బందులు పడుతున్నారు. నేను ఎయిర్‌ఇండియా సంస్థకు చెందిన విమానంలో ప్రయాణించా. దీనికోసం గంట 19 నిమిషాలు వేచి చూడాల్సి వచ్చింది. ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేసే ఇలాంటి ఆలస్యాలు ఆమోదయోగ్యం కావు. విమానయాన సంస్థలకు కఠినమైన నిబంధనలు విధించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుని ఈసందర్భంగా కోరుతున్నా. ఇలాంటి జాప్యాలు పునరావృతం కాకుండా ఆయా సంస్థలు బాధ్యతగా వ్యవహరించాలి. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి' అని ఆమె రాసుకొచ్చారు. ఇక, ఈ పోస్టుపై ఎయిర్ ఇండియా సంస్థ స్పందించింది. తమ చేతుల్లో లేని పలు సమస్యల వల్ల విమానాలు ఆలస్యం అవుతున్నాయని తెలిపింది. మీరు ప్రయాణించే విమానానికి అలాంటి సమస్యే ఎదురైనట్లు వెల్లడించింది. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని ఎక్స్ వేదికగా పేర్కొంది.

## హక్కుల కోసం బహుజనులు ఉద్యమించాలి



సిద్దిపేట, మార్చి22: బహుజనుల హక్కుల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమించాల్సి అవసరం ఎమ్మెల్సీ కవిత అన్నారు. దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమంలో తెలంగాణ జాగృతి మొదటి వరుసలో ఉంటుంది అని కవిత పేర్కొ న్నారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు. బీసీ బిల్లులు ఆమోదం పొందితే మొక్కు చెల్లించుకుంటానని గతంలో ప్రకటన చేశానని. చట్టసభలు బిల్లలు ఆమోదించిన నేపథ్యంలో కొమురవెల్లిలో మొక్కు చెల్లించుకున్నానని తెలిపారు. తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ డిమాండ్‌కు ప్రభుత్వం తలొగ్గి వేర్వేరు బిల్లును పెట్టిందని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లులు ఆమోదం పొందిన రీత్యా ప్రభుత్వం తదుపరి అడుగు వేయాలని డిమాండ్‌చేశారు. చట్టాలను కేంద్రం నుంచి ఆమోదించుకొని అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఆమోదించిన చట్టాలను ఎవరైనా కోర్టుల్లో సవాలు చేస్తే ప్రభుత్వం గట్టిగా కొట్లాడాలి అని కవిత పేర్కొన్నారు. దేశంలో 50 శాతా నికి పైగా రిజర్వేషన్లు కల్పిస్తున్న రాష్ట్రాలు తెలంగాణతో సహా దాదాపు 10 ఉన్నాయన్నారు. ఈడబ్ల్యూస్ రిజర్వేషన్లు అమలైన తర్వాత తెలంగాణలో 54 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయన్న విషయాన్ని ప్రభుత్వం గమనించాలన్నారు. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి తొలిగిపోయిన నేపథ్యంలో కోర్టుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం గట్టిగా వాదించాలని కోరారు. రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాలకు కలిపి ఒకే బిల్లు పెడితే బీసీలకు అన్యాయం జరుగుతుందని తొలి నుంచి వాదిస్తున్నాం అని కవిత తెలిపారు. అసెంబ్లీ అవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. సమాజం పరిణితి చెందుతున్నా కొద్ది విస్మరించిన వర్గాలు ఒక్క చోటుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ బిల్లులు అంటే.. ఆ ఒక్క వర్గం లొల్లి కాదు ఇది అందరి లొల్లి అని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. కొమురవెల్లి మలన్నకు ప్రభుత్వం తరఫున కేసీఆర్ 130 ఎకరాల మాన్యం భూమిని అందించాలన్నారు. కేసీఆర్ హయాంలో కనీవినీ ఎరగని రీతిలో అభివృద్ధి జరిగిందని గుర్తుచేశారు. కొమురవెల్లి అభివృద్ధి కోసం బీఆర్ఎస్ హయాంలో చేసిన ఖర్చు రూ 50 కోట్లు.. తెలంగాణ రాష్ట్రానికి వరప్రదాయని అయిన ఒక రిజర్వాయర్‌కు మలన్న సాగర్ అని పేరు పెట్టుకోవడం జరిగింది అని కవిత గుర్తు చేశారు.

## బీజేపీ అధ్యక్షుడి రేసులో నేను లేను : బండిసంజయ్

హైదరాబాద్,మార్చి22: స్టాలిన్ మీటింగ్‌లో అందరూ దొంగలేనని కేంద్ర మంత్రి బండిసంజయ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర నూతన బీజేపీ అధ్యక్షుడిగా బండి సంజయ్ అంటూ గత కొద్దిరోజులుగా ప్రచారం జోరుగా సాగుతున్న క్రమంలో 'నేను రాష్ట్ర అధ్యక్ష రేసులో లేను, నాకే రావాలని కోరుకోవడం లేదు' అని తేల్చి చెప్పేశారు. అలాగే సోషల్ మీడియా, మీడియాలో వచ్చే పేర్లపై, ప్రచారం చేసుకునే నేతలపై అధిష్ఠానం సీరియస్‌గా ఉందని వెల్లడించారు. డీలిమిటేషన్‌పై చెన్నైలో తమిళనాడు సీఎం స్టాలిన్ అధ్యక్షతన జరుగుతున్న దక్షిణాది రాష్ట్రాల సమావేశంపై స్పందించారు. స్టాలిన్ మీటింగ్‌లో ఉన్నది అందరూ దొంగలే అంటూ కామెంట్స్ చేశారు. లిక్కర్ స్కామ్, ల్యాండ్ స్కామ్ ముఠాలు మీటింగ్ పెట్టుకున్నాయని దుయ్యబట్టారు. మీటింగ్‌లో పాల్గొన్న పార్టీలకు అవినీతి చరిత్ర ఉందన్నారు. కేసీఆర్ కుటుంబానికి నోటీస్ ఎందుకు ఇవ్వవు రేవంత్ అని ప్రశ్నించారు. డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభమే కాలేదని తెలిపారు. తమిళనాడులో డీఎంకే వెయ్యి కోట్ల లిక్కర్ స్కామ్ చేసిందని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వలేదని మండిపడ్డారు.



కాంగ్రెస్ ఏర్పడి 15 నెలలు అయినా రైతులను పట్టించుకోవడం లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.



సీఎం గారిని కలిసిన రాపోలో జయప్రకాశ్ గారు

## తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ను కలిసిన ఓయూ జేఏసీ చైర్మన్



హైదరాబాద్,ఉస్మానియా యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ విడుదల చేసిన సర్క్యులర్ ఉపసంహరించుకోవాలి అని ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటుకల పురుషోత్తం గారిని గురువారం తన కార్యాలయంలో ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజాస్వామ్యబద్ధమైన విద్యార్థి నిరుద్యోగ శాంతియుత నిరసనలకి వ్యతిరేఖంగా ఓయూ రిజిస్ట్రార్ విడుదల చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకునే విధంగా కృషి చేయాలని ప్రొఫెసర్ పురుషోత్తం ని కోరారు.

## దక్షిణాదిలో సీట్లు తగ్గకుండా చూడండి..

అమరావతి,మార్చి22: డీలిమిటేషన్ పై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లేఖ రాశారు. దక్షణాది రాష్ట్రాలకు సీట్ల సంఖ్యలో తగ్గింపు లేకుండా చూడాలని లేఖలో ప్రధానిని కోరారు. 2026లో జరిగే డీలిమిటేషన్ పై దక్షిణాది రాష్ట్రాల్లో ఆందోళన ఉంది.. తమ రాష్ట్రాల్లో నియోజకవర్గాలు తగ్గుతాయనే చర్చ ఆందోళన కలిగిస్తోంది..గత 15 ఏళ్లలో దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా తగ్గింది.. గతంలో కేంద్రం ఇచ్చిన జనాభా నియంత్రణ పిలుపు మేరకు ఈ తగ్గుదల కనిపించింది.. ఇప్పుడు జనాభా లెక్కల ప్రకారం డిలిమినేషన్ చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు భాగస్వామ్యం తగ్గుతుంది.. అందుకే జనాభా లెక్కల ప్రకారం ఈ డీలిమిటేషన్ లేకుండా చూడాలి అని వైఎస్ జగన్ చెప్పుకొచ్చారు.



## సంపాదకీయం

**ఆదివారం 23-03-2025**

# దక్షిణాధిపత్య రాజకీయం !

దక్షిణ రాష్ట్రాల్లో పాగా వేయలన్నది బిజెపి ఆశ..దాన్ని డ్డుకోవాలన్నది డిఎంకె తదిర ప్రాంతీయ పార్టీల వ్యూహం. అందుకే తొలుత హిందీ వ్యతిరేకతతో మొదలైన యుద్దం ఇప్పుడు డీ లిమిటేషన్ వ్యవహారం తెరపైరకి తెచ్చారు. నిజానికి డీ లిమిటేషన్ వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదు. అయితే రాజకీయం కనుక రచ్చ చేయాలన్నదే రాకీయ పార్టీల లక్ష్యం. మొన్న పార్లమెంట్ ఎన్నిల్లో బిజెపి కోరుకున్న 400 మార్కును దాటలేక పోయారు. దీంతో కొత్త వ్యూహాలను అమలు చేసేందుకు సిద్దం అవుతారని అందరికీ తెలుసు. బిజెపిని అధికారం నుంచి తొలగించకుండా పక్కాగా ప్లాన్ చేయడమెలా అన్నది మోడీ ద్వయానికి బాగా తెలుసు. అందుకే వారు దక్షిణాది వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ఉత్తరాదిలో రాముడు రక్షిస్తాడన్న ధీమా వచ్చేసింది. రామనామం ఉత్తరాదిలో ఊపేస్తోంది. అనన్య సాధ్యమైన అయోధ్య సాకారం అయ్యింది. దీంతో ఉత్తరాదిలో బిజెపికి తిరుగులేదన్న విధంగా పరిస్థితులు ఉన్నాయి. కానీ దక్షిణాది పరిస్థితి వేరు. కర్నాటక కూడా చేజారిపోయింది. తెలంగాణలో వచ్చిన అవకాశాన్ని చేజేతులా జారవిడుచుకున్నారు. తెలంగాణలో 17 సీట్ల కోసం పోటీపడి 8సీట్లు సాధించారు. ఇదే తరహాలో మిగతా రాష్ట్రాల్లోనూ గెలవాల్సి ఉంది. ఒడిషాలో అధికారం చేపట్టారు. అందుకే తమిళనాడు, కర్నాటక, కేరళ, తెలంగాణల్లో పట్టు సాధించేందదుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. దక్షిణాదిని గుప్పిట పెట్టుకోవాలని పట్టుదలగా ఉన్నారని కనిపిస్తోంది. తాజాగా కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ దారికొచ్చారు. మోడీని, ఆయన విదేశాంగ విధానాన్ని సమర్థిస్తున్నారు. ఇలా కొందరు నేతలతో బిజెపిని పొగిడించుకోవడం కూడా ఓ ఎత్తుగడే. తమిళనాట అన్నాడిఎంకె దూరమైనా చిన్నాచితక పార్టీలతో జతకట్టారు. గవర్నర్‌గా ఉన్న తమిళిసై మళ్లీ రాజకీయ అరంగేట్రం చేసినా ఫలితం దక్కలేదు. అయితే అన్నామలై అక్కడ గట్టిగానే పోరాడుతున్నారు. బిజెపిని ముందునుంచి ప్రజలు ఉత్తరాది పార్టీగానే గుర్తిస్తూ వచ్చారు. అయితే దానిని తిరగరాస్తూ కర్నాటకలో కాలుమోపారు. కానీ స్థానిక నాయకత్వం నిర్లక్ష్యం, అవినీతి కారణంగా గత అసెంబ్లీ మూల్యం చెల్లించుకోక తప్పలేదు. బిజెపి జాతీయవాదానికి దేశవ్యాప్త ఆమోదం కోసం యత్నిస్తోంది. భారతదేశంలో బిజెపి అంతటా విస్తరించిందని చెప్పుకోవడం కూడా అవసరం. అందుకే విజయం కోసం భారతీయ జనతాపార్టీ తీవ్రంగా యత్నిస్తోంది. గత పదేళ్ల బిజెపి పాలనా కాలం తీసుకుంటే అన్ని రాష్ట్రాల్లో విస్తరించేందుకు చేయని ప్రయత్నం లేదు. కేవలం నినాదాలకే పరిమితం కాకుండా అభివృద్ధి, సెంటిమెంట్ ఎజెండాలను కలుపుకుని ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈశాన్యంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధికి పెద్దపీట వేసింది. బెంగాల్ లోను, దక్షిణ రాష్ట్రాల్లో గెలుపు కోసం బూత్‌లెవల్ కార్యాచరణను అమలు చేస్తోంది. క్షేత్రస్థాయి నుంచి పనిచేసుకుంటూ పథకం ప్రకారం బలాన్ని పెంచుకోగలిగిన శక్తిని బీజేపీ ప్రదర్శిస్తోంది. కార్యశీలురైన నాయకులు, కార్యకర్తలు దండిగా ఉన్నారు. ఫలితాలు ఎట్లా ఉన్నా, వారు అలుపెరగకుండా ప్రయత్నాలన్ని చేస్తూనే ఉన్నారు. కర్ణాటక అపజయం బీజేపీకి కొత్తేమీ కాదు. పొత్తులతోనో, ఫిరాయింపులతోనో బీజేపీ కర్ణాటకలో ఒకటి రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు ఒక మైనర్ భాగస్వామిగా అయినా ప్రభుత్వంలో ఉన్నది. తెలంగాణలో తగినంత ఉనికితో ఎప్పటి నుంచో సత్తా చాటుతోంది. గత పార్లమెంటు ఎన్నికలలో 8 స్థానాలతో, సుమారు 20 శాతం ఓట్లతో తన ఉనికిని విస్తరించుకోగలిగింది. కేరళలో 2016లో ఒక ఎమ్మెల్యేను గెలిపించుకున్న బీజేపీ, 2021లో 11 శాతానికి పైగా ఓట్లను సంపాదించింది. అక్కడక్కడా ఉనికిలో ఉన్నప్పటికీ దక్షిణాది ఇంకా పట్టుబడలేదన్న లోటు మాత్రం బీజేపీకి ఉన్నది. దక్షిణాదిలో విస్తరించాలన్న ఆకాంక్ష బీజేపీకి, మోదీకి అంతిమలక్ష్యంగా మారింది. అందుకే దక్షిణాదిపై ఎక్కువగా దృష్టి సారించారు. తమిళనాట చెలరేగుతున్న నిరసలు, ఉద్యమాలను తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు. హిందీ వ్యతిరేకతను ప్రజలే ఛీత్కరించుకునేలా చేస్తున్నారు. డీలిమిటేషన్ కారణంగా ఉత్తరాదిలో మరిన్ని సీట్లు పెరిగే అవకాశమున్నట్లు డిఎంకు తదితర పార్టీలు ఆందోళన చెందుతున్నాయి. తమిళనాడు, కేరళల్లో ప్రస్తుతానికి పరిస్థితి ఆశాజనకంగా ఉంది. మోడీ వ్యక్తిగత ఛరిష్మా కూడా పనిచేస్తోంది. ఆ రెండు రాష్ట్రాల్లో గతం కంటే ఓట్లు, సీట్లు పెంచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. కర్ణాటకలో ఇప్పటికే కాంగ్రెస్ పాలన మీద విముఖత కలిగిందన్న ప్రచారం మొదలయ్యింది. గతంలో ఉన్న బలాన్ని నిలుపుకోవడం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, జనసేన, బీజేపీ కూటమి ఏర్పాటు కావడంతో అక్కడ విజయం సాధించడం ద్వారా కొంత పట్టు నిలుపుకుంది. పవన్ కళ్యాణ్ పేరుకు జనసేనానిగా ఉన్నా, ఆయన ఆశలు,ఆశయాలు బిజెపితో పెనవేసుకుంటున్నాయి. ఆయన వీరికి తురుపుముక్కగా ఉంటారనడం లో సందేహం లేదు. ఈ కలయిక దీర్ఘకాలికంగా బీజేపీ విస్తరణ ప్రయత్నాలకు తోడ్పడగలదు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభావం గణనీయంగానే పెరిగింది. ఇప్పుడది ఆ పార్టీకి కీలకమయిన విజయం అవుతుందని భావిస్తోంది. తెలంగాణలో అధికప్రభావం చూపగలిగితే కనుక, బీజేపీ వెంటనే రెండో స్థానానికి, అతి త్వరలో అధికారస్థానానికి చేరుకోగలుగుతుంది. దక్షిణ భారతదేశంలో తమిళనాడుతో పాటు మూడు కేందప్రాలిత ప్రాంతాల్లో పాగా కోసం బిజెపి అహరహరం అందుకే కృషి చేస్తోంది. డిఎంకె ఎత్తులకు పైఎత్తులు వేస్తోంది. వారు చేసే డీలిమిటేషన్, హిందీవ్యతిరేక ఆందోళనలను తనకు అనుకూలంగా మలచుకుంటోంది. తమిళనాడులో గత బీజేపీకి ప్రస్తుత బీజేపీకి పూర్తిగా తేడా కనిపిస్తోంది. రాష్ట్ర అధ్యక్షుడిగా అన్నామలై బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి క్షేత్రస్థాయిలో పార్టీ బలపడుతూ వస్తోంది. పాదయాత్రలతో పాటు.. డీఎంకే అవినీతిపై ఆయన ఆరోపణలు చేస్తూ.. ఆధారాలు విడుదల చేశారు. దీంతో డీఎంకే సైతం బీజేపీని టార్గెట్ చేయడం మొదలుపెట్టింది. దీంతో డీఎంకే, అన్నాడీఎంకె మధ్య పోరు.. డీఎంకే, బీజేపీగా అన్నామలై మార్చేశారు. ప్రధాని మోదీ సైతం తమిళనాడుపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇలా కేరళలోనూ ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ క్రమంలో బిజెపికి కేంద్రంలో అధికారంలో ఉండడం కలసి వస్తోంది.

# ఉపాధి పథకానికి కేంద్రం తూట్లు



న్యూఢిల్లీ,మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ ఇజిఎస్) అమలు తీరులో ఎన్నో లోపాలు ఎత్తిచూపుతూ గత వారం గ్రామీణాభివృద్ధికి సంబంధించిన పార్లమెంటరీ కమిటీ ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసింది. ఇదే విధంగా మంగళవారం రాజ్యసభ ఎంపి, కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ కూడా రాజ్యసభలో ఈ పథకంలోని లోపాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి చలనం కనిపించడం లేదు. బిజెపి అధికారంలోకి వచ్చాక నిబంధనల పేరుతో పథకానికి తూట్లు పొడుస్తోంది. ఒకవిధంగా ఈ ఉపాధి పథకానికి ఊపిరి తీసేస్తోందని చెప్పడంలో తప్పేమీ లేదు. పార్లమెంటరీ కమిటీకి కాంగ్రెస్ ఎంపి సప్తగిరి శంకర్ ఉలాకా నేతృత్వం వహిస్తున్నారు.గ్రామీణాభివృద్ధి విభాగానికి బడ్జెట్‌లో కేటాయింపులపై సమీక్ష సందర్భంగా గత బుధవారం దీనిపై కమిటీ సూచనలతో కూడిన నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం ప్రస్తుతం ఈ పథకం కింద రోజువారీ చెల్లిస్తున్న వేతనాల్లో చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. ఉదాహరణకు నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్‌ల్లో రోజుకు రూ. 234 చెల్లిస్తుండగా, హర్యానా, సిక్కింల్లో రూ. 374 వరకు చెల్లిస్తున్నారు. ఈ వేతనాలు ప్రస్తుతం వ్యవసాయ కార్మికులకు కన్సూమర్ ప్రైస్ ఇండెక్స్ (వినియోగదారుల ధరల సూచిక)తో ముడిపెడుతున్నారు. అయితే ఈ సూచిక ద్రవ్యోల్బణం అసలు ప్రభావాన్ని గుర్తించడం లేదు.అందువల్ల వేతనాలను లెక్కకట్టే పద్ధతిని సమీక్షించవలసిన అవసరం కనిపిస్తోంది. క్షేత్రస్థాయిలో వాస్తవ ఆర్థిక పరిస్థితుల ఆధారంగా ప్రాధాన్యాలను పరిగణించి తాజాగా వేతనాలను నిర్ణయించడం తప్పనిసరి. ఈ పథకానికి ప్రధానంగా కేంద్రమే నిధులు కల్పిస్తున్నందున, అన్ని రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఒకే రీతిలో వేతనాలు చెల్లించడం న్యాయం. అలాగే ఈ పథకం కింద రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో జాప్యం జరుగుతోంది. ఫిబ్రవరి 15 వరకు అందిన నివేదిక ప్రకారం ఈ వేతనాల బకాయిలు రూ. 12,219.18 కోట్లతో కలుపుకుని చెల్లించవలసి ఉన్న మొత్తం రూ. 23,446.22 కోట్లు వరకు ఉన్నాయని తేలింది. కేటాయించిన నిధుల్లో నాలుగోవంతు అంటే రూ. 86,000 కోట్లు వరకు గత ఆర్థిక సంవత్సరంలో పేరుకుపోయిన బకాయిలను తీర్చడానికే సరిపోతుందని కమిటీ గుర్తు చేసింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ బడ్జెట్‌ను రూ. 62,553.73 కోట్ల వరకు తగ్గించారు. ఈ పథకం సామర్థ్యాన్ని పరిమితం చేశారు.పశ్చిమ బెంగాల్ విషయాన్ని పరిశీలిస్తే ఈ పథకం కింద కేటాయించాల్సిన నిధులు 2022 మార్చి వరకు అందలేదు. ఈ పథకం అమలులో అవినీతి జరుగుతోందన్న ఆరోపణపై కేంద్రం నిధుల కేటాయింపును ఆపేసింది. ఈ విధంగా నిధుల కేటాయింపు రద్దును కొనసాగించడం వల్ల తీవ్ర పరిణామాలు సంభవిస్తున్నాయి. వలస కార్మికుల్లో అసంతృప్తి పెరిగి, వేరే చోటకు వలసలు సాగించడం రానురాను ఎక్కువవుతోంది. గ్రామీణాభివృద్ధి పనులకు అంతరాయం కలుగుతోంది. గ్రామీణ ప్రజల జీవితాలపై వ్యతిరేక ప్రభావం చూపిస్తుంది. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక ఇబ్బందులు పెరుగుతాయి. ఈ పథకం నిధుల విషయంలో పశ్చిమ బెంగాల్‌లో కోర్టు వివాదంలో ఉన్న సంవత్సరం తప్ప మిగతా అర్హమైన అన్ని సంవత్సరాలకు తప్పనిసరిగా నిధులు కేటాయించాల్సిందేనని పార్లమెంటరీ కమిటీ స్పష్టం చేసింది.ఎంజిఎన్ఆర్ఇజిఏ 2005 లోని సెక్షన్ 27ను ప్రస్తావించిన తరువాత కేంద్రం ఈ పథకం నిధులను స్తంభింపచేయడం ప్రారంభించింది. ఈ సెక్షన్ 27 ప్రకారం పథకం అమలులో నిబంధనలను ఉల్లంఘిస్తే కేటాయించే నిధులను స్తంభింప చేసే హక్కు కేంద్రానికి ఉంటుంది.ఈ సాకుతో పశ్చిమ బెంగాల్‌కు నిధుల కేటాయింపులో కేంద్రం బ్రేకు వేసింది. దీని వల్ల పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య సంబంధాలు ఉద్రిక్తంగా తయారయ్యాయి. ఈ పథకం నిధుల కేటాయింపులో కేంద్రం అనుసరిస్తున్న వివక్షపై తృణమూల్ కాంగ్రెస్ ఢిల్లీలోను, పశ్చిమ బెంగాల్‌లోనూ ఆందోళనలు చేపట్టింది. ఈ పథకం కింద రావలసిన నిధులపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కేంద్రానికి అనేక ఉత్తరాలు రాశారు.ఇక చేసేది లేక రాష్ట్రంలోని గ్రామీణ ప్రజలకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించడానికి కర్మశ్రీ అనే పథకాన్ని ఆమె ప్రత్యేకంగా ప్రకటించారు. మంగళవారం (18 3 2025) రాజ్యసభలో సోనియా గాంధీ ఈ పథకం తీరు తెన్నులపై కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీశారు. ఈ పథకానికి బడ్జెట్ కేటాయింపులు రానురాను తగ్గిస్తూ నిర్వీర్యం చేస్తున్నారని, బడ్జెట్ కేటాయింపులు రూ. 86,000 కోట్ల వద్ద నిలిచిపోయాయని, ఇది జిడిపిలో పదేళ్ల కనిష్ఠ స్థాయికి చేరిందని విమర్శించారు. ద్రవ్యోల్బణంతో సర్దుబాటు చేసినప్పుడు బడ్జెట్ రూ. 4000 కోట్లు తగ్గుతుందని, కేటాయించిన నిధుల్లో దాదాపు 20% గత సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉన్న బకాయిలను క్లియర్ చేయడానికి సరిపోతుందని స్పష్టం చేశారు.అదనంగా ఈ చట్టం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, వాటిలో ఆధార్ ఆధారిత చెల్లింపు, నేషనల్ మొబైల్ మోనిటరింగ్ సిస్టమ్, వేతన చెల్లింపులో నిరంతర జాప్యాలు, ద్రవ్యోల్బణాన్ని భర్తీ చేయడానికి సరపడా వేతన రేట్లు లేకపోవడం తదితర లోపాలను ఆమె బయటపెట్టారు. ఈ చట్టం కింద కనీస వేతనాలతోపాటు పని దినాల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. సకాలంలో వేతనాలు చెల్లించాలని, కనీస వేతనాన్ని రోజుకు రూ. 400కు పెంచాలని, ఏడాదికి హామీ ఇవ్వబడిన పని దినాల సంఖ్యను 100 నుంచి 150కి పెంచాలని డిమాండ్ చేశారు. అయినా అవన్నీ చెవిటివాని ముందు శంఖం ఊదినట్టు తయారైంది.

# మళ్లీ భారత్ కు చమురు సంక్షోభం!

సెంట్రల్ డెస్క్:పశ్చిమాసియాలో ఎలాంటి సంఘర్షణలు ఎదురైనా భారతీయ వాణిజ్య రంగానికి సంక్షోభం తప్పదు. చమురు, సహజ వాయువు, ఎరువులు, తదితర ముఖ్య అవసరాలు సరిగ్గా సరఫరా కాక, వాణిజ్యంలోనే కాదు, ప్రజల జీవన విధానంలో కూడా ఒడిదుడుకులు ఎదురవుతుంటాయి. ముఖ్యంగా చమురు సంక్షోభం సంభవిస్తే అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధర ఒక్కసారిగా పెరిగిపోతుంది. మనకు ఎఉక్కువగా చమురును, గ్యాస్‌ను సరఫరా చేసేది రష్యా, ఇరాన్ దేశాలే. ఆయా దేశాల నుంచి సరఫరాకు ఆటంకాలు ఏర్పడితే మన దేశం భారీగా అంతర్జాతీయ మార్కెట్‌కు మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది ఫిబ్రవరిలో రష్యా నుంచి మనదేశానికి ముడి చమురు దిగుమతులు రోజువారీ సరాసరిన (మిలియన్ పెర్ డే) 1.41 మిలియన్ బ్యారెళ్ల వంతున తగ్గిపోవడం ఆందోళన కలిగించే అంశం.గత సంవత్సరం జనవరి నాటికి రోజువారీ 1.49 మిలియన్ బ్యారెళ్ల వంతున తగ్గిపోగా అంతకన్నా ఇప్పుడు తగ్గడం గమనార్హం. కార్గో ట్రాకింగ్ ఏజెన్సీ వోర్టెక్స్ వివరాల ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరిలో రోజువారీ మొత్తం 4.77 మిలియన్ బ్యారెళ్లుగా చమురు దిగుమతులు జరిగాయి. జనవరిలో రోజువారీ మొత్తం 4.76 మిలియన్ బ్యారెళ్ల చమురు దిగుమతులు కాగా పెద్దగా మార్పు లేదు. అయితే ఈ మార్చి, ఏప్రిల్ నెలల్లో మరింతగా చమురు దిగుమతులు క్షీణిస్తాయని వోర్టెక్స్ చెబుతోంది. దీనికి కారణం అమెరికా ఆఫీస్ ఆఫ్ ఫారెస్ అసెట్స్ కంట్రోల్ (ఒఎఫ్ఎసి) జనవరి 10 న విధించిన ఆంక్షలే.అయితే ఈ లోటును పశ్చిమాసియా దేశాలు భర్తీ చేస్తాయని ఎపిఎసి అనాలిసిస్ వోర్టెక్స్ అధినేత ఇవాన్ మేథ్యూ వెల్లడించారు. రష్యా చమురు ఉత్పత్తిదారులైన గాజ్‌ప్రోమ్ నెఫ్ట్, సర్గుట్ నెఫ్ట్ గ్యాస్‌లతో పాటు దాదాపు 180 ట్యాంకర్లపై తాజాగా జనవరి 10న అమెరికా ఆంక్షలు విధించింది. రష్యాకు రెవెన్యూ రాకుండా అడ్డుకోవడమే దీని వెనుక ఉన్న ఆంతర్యం. ఉక్రెయిన్‌పై యుద్ధం సాగించడానికే రష్యా ఈ ఆదాయాన్ని ఖర్చు పెడుతోందని అమెరికా ఆరోపిస్తోంది. ఫలితంగానే రష్యా చమురు కార్గో నౌకలు ఫిబ్రవరి 27 నాటికి అమెరికా ఆంక్షల సుడిలో చిక్కుకోవలసి వచ్చింది.2024 మొదటి ఏడు మాసాలు (జనవరి జులై) ఇజ్రాయెల్, జోర్డాన్, లెబనాన్ దేశాలకు భారత్ నుంచి వాణిజ్యంలో సంఘర్షణలు తప్పలేదు. భారత్ నుంచి ఇజ్రాయెల్‌కు 63.3 శాతం వరకు ఎగుమతులు పతనమయ్యాయి. దీని విలువ 1.3 బిలియన్ డాలర్లు. ఆర్గానిక్ కెమికల్స్, పెట్రోలియం ఉత్పత్తులు, డైమండ్స్, ఎగుమతులకు గండి పడిందని వాణిజ్య విభాగం వెల్లడించింది. అలాగే జోర్డాన్‌కు ఎగుమతుల్లో 38 శాతం అంటే 638 మిలియన్ డాలర్ల వరకు, లెబనాన్‌కు 7% అంటే 198 మిలియన్ డాలర్ల వరకు ఎగుమతులు పతనమై భారత్‌కు నష్టాలు సంభవించాయి.2024 వరకు అంతకు ముందు ఏడేళ్లుగా ఏటా 3% వంతున ముడిచమురు ఉత్పత్తిలో తగ్గుదల కనిపిస్తోంది. ఉత్పత్తిలో తగ్గుదల ఉంటున్నా వినియోగం పెరుగుతుండడంతో భారత్ దిగుమతులపై ఎక్కువగా ఆధారపడవలసి వస్తోంది. 2017 నుంచి 2024 వరకు 86 నుంచి 89 శాతం వరకు దిగుమతులపైనే దేశం ఆధారపడవలసి వచ్చింది. భారత ఇంధన వినియోగ చిత్ర 2024 ఆర్థిక సంవత్సర నివేదికలో ఇదో భాగం. దేశం ఇంధనాన్ని సేకరించడం, ఉత్పత్తి, వినియోగం తాలూకు ఆమూలాగ్ర డేటాను ఈ నివేదిక అందిస్తోంది. కేంద్ర ఇంధన మంత్రిత్వశాఖ నేతృత్వంలో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియెన్సీ (బిఇఇ)ఈ నివేదికను రూపొందించింది.2024 ఆర్థిక సంవత్సరంలో మొత్తం సరఫరా అయిన ఇంధనం 910 మిలియన్ టన్నులు కాగా, ఇందులో బొగ్గు నుంచి 60%, చమురు నుంచి 28%, గ్యాస్ నుంచి 7%, శిలాజేతర వనరుల నుంచి 5% సరఫరా అయింది. స్వదేశీ చమురు ఉత్పత్తి 2017 ఆర్థిక సంవత్సరంలో 36 మిలియన్ టన్నులు కాగా, 2024 నాటికి 29.4 మిలియన్ టన్నులకు తగ్గిపోయింది. వార్షిక రేటు 3% వరకు తగ్గుతూ వస్తోంది. ఈ తగ్గుదలకు



అనేక కారణాలు దోహదం చేస్తున్నాయి. ఈ కొరతను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు 2019లో హైడ్రోకార్బన్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ లైసెన్సింగ్ (హెచ్ఇఎల్‌పి) వంటి ప్రక్రియను అమలుచేసే చర్యలను తీసుకుంది.ఎంపికైన చమురు క్షేత్రాల్లో తగిన సాంకేతిక విధానాలు అమలు చేసి చమురు ఉత్పత్తిని సాధించడమే ఈ విధానం లక్ష్యం. చిన్న, మధ్యతరహా స్థాయిలో చమురు పరిశోధనలను కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ద్వారా ఆయా సంస్థలను ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ నిర్వహణలోని ఒఎన్‌జిసి, ఆయిల్ ఇండియా సంస్థలు క్రమంగా 65 శాతం, 11 శాతం వరకు 20232024 సంవత్సరంలో చమురును అందించగలిగాయి. మిగతా 24 శాతం ముడిచమురు ఉత్పత్తి ప్రొడక్షన్ షేరింగ్ కాంట్రాక్ట్ (పిఎస్‌సి) లేదా రెవెన్యూ షేరింగ్ కాంట్రాక్ట్ (ఆర్ఎస్‌సి) ద్వారా లభించింది. 2024 ఏప్రిల్ 1 నాటికి సమతుల్యతలో తిరిగి పొందగలిగిన చమురు నిల్వలు 671.4 మిలియన్ టన్నులుగా భారత్ అంచనా వేసింది. అంతకు ముందు సంవత్సరం నాటి 669.47 మిలియన్ టన్నుల నిల్వలతో పోల్చుకుంటే 0.3 శాతం ఎక్కువ.స్వదేశీ చమురు ఉత్పత్తి కన్నా డిమాండ్ ఎక్కువగా ఉండడంతో చమురు దిగుమతులపై ఆధారపడడం మరింత ఎక్కువ అవుతుందని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేస్తోంది. ప్రపంచంలోనే మూడో అతి పెద్ద చమురు దిగుమతి దారైన భారత్ 2024లో 234 మిలియన్ టన్నుల చమురును సేకరించుకోగలిగింది. సరఫరా కావలసి చమురులో 86% 2017లోను, 89% 2024 లోనూ దిగుమతి చేసుకోవలసి వచ్చింది. కొవిడ్ మహమ్మారి సమయంలో చమురు దిగుమతులు తాత్కాలికంగా 202122 లో తగ్గాయి. భారీ స్థాయిలో దిగుమతి చేసుకున్నామంటే రిఫైన్డ్ పెట్రోలియం ఉత్పత్తుల వినియోగం భారీగా పెరుగుతున్నట్టే భావించక తప్పదు. 2024 ఏప్రిల్ 1నాటికి ఏడాదికి 256.8 మిలియన్ టన్నుల చమురును రిఫైనింగ్ చేసే సామర్థం భారత్‌కు ఉందని తేలింది. దీంతో ప్రపంచంలో అమెరికా, చైనా, రష్యా తరువాత నాలుగో రిఫైనర్‌గా భారత్ నిలుస్తోంది.

### యాంకర్ శ్యామలకు హైకోర్టులో ఊరట

హైదరాబాద్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత, యాంకర్ శ్యామలకు తెలంగాణ హైకోర్టులో ఊరట దక్కింది.. బెట్టింగ్ యాప్ ప్రమోట్ చేసినందుకు ఇటీవల హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో శ్యామలపై కేసు నమోదైన విషయం విదితమే.దీనిపై హైకోర్టును ఆశ్రయించారు శ్యామల.. తనపై నమోదైన ఎఫ్ఐఆర్ క్వాష్ చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు.. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత.. శ్యామలను అరెస్టు చేయవద్దంటూ పోలీసులను ఆదేశించింది.. దీంతో, ఆమెకు బిగ్ రిలీఫ్ దక్కినట్టు– అయ్యింది.. ఇదే సమయంలో.. విచారణకు సహకరించాలని యాంకర్ శ్యామలను ఆదేశించింది హైకోర్టు.. సోమవారం నుండి పోలీసుల ఎదుట విచారణకు హాజరుకావాలని స్పష్టం చేసింది.. ఇక, నోటీ–సు ఇచ్చి విచారణ కొనసాగి ంచవచ్చు అని తెలంగాణ హైకోర్టు పేర్కొంది..

# సూడాన్‌లో రాజకీయ అనిశ్చితి

న్యూఢిల్లీ,దాదాపు రెండేళ్ల తర్వాత సూడాన్ సైన్యం ఖార్టూమ్‌లోని అధ్యక్ష భవనాన్ని ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ నుంచి తిరిగి స్వాధీనం చేసుకొంది. దీనికి సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. దీనిపై ఆర్ఎస్ఎఫ్ వర్గాలు ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. దాదాపు రెండేళ్ల క్రితం రాజధాని ఖార్టూమ్‌లో భయంకరమైన అంతర్యుద్ధం మొదలైంది. దీంతో ఆ నగరంలోని చాలా ప్రాంతాల ను ఆర్ఎస్ఎఫ్ అధీనంలోకి తీసుకొంది. తాజాగా ఈ ప్రదేశంపై పట్టు– సాధించడం సైన్యానికి అతిపెద్ద విజయమనే చెప్పొచ్చు. ఇటీ–వల ఆర్మీ మధ్య సూడాన్‌లోని ప్రాంతాల్లో వరుసగా విజయాలు సాధిస్తోంది. గురువారం రిపబ్లికన్ ప్యాలెస్ వద్ద డ్రోన్లు, యుద్ధ విమానాలు దాడులు చేశాయి. సూడాన్‌లోని పారామిలిటరీ రాపిడ్ సపోర్ట్ ఫోర్స్ దళాన్ని సైన్యంలో విలీనం చేసేందుకు రూపొందించిన ప్రతిపాదన.. రెండు బలగాల మధ్య ఘర్షణలకు దారితీసింది. ఈవిషయమై సైన్యాధినేత అబ్దుల్ ఫతాఅల్ బుర్హాన్, పారామిలిటరీ కమాండర్ మహ్మద్ హందాన్ దగ్లో మధ్య కొన్ని వారాలుగా నెలకొన్న విభేదాలు.. తీవ్రస్థాయికి చేరడంతో అంతర్యుద్ధం మొదలైంది. ఆ తర్వాత అధ్యక్ష భవనం, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి వాటిని ఆర్ఎస్ఎఫ్ అధీనంలోకి తీసుకొంది. ఇక ఈ యుద్ధాన్ని ఆపేందుకు యత్నించిన ఐరాస సంస్థలను కూడా దేశం వీడేలా చేశారు.

# అబద్ధాలతో పాలన సాగిస్తున్న రేవంత్ సర్కార్

హైదరాబాద్, రేవంత్‌రెడ్డి సర్కార్ చెప్పేవన్నీ అబద్ధాలేనని, వారు ఒకటి చెప్తే ఇంకోటి చేస్తారని.. రాష్ట్రంలో గందరగోళ పరిస్థితి ఉందని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఎన్నికల ముందు మార్పు పేరుతో వాగ్దానాలు ఇచ్చారని, ఎన్నికల తర్వాత ఆ వాగ్దానాలను ఏమార్చరని అన్నారు. ఎన్నికల ముందు ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామన్నారని, ఇప్పుడేమో ఎల్ఆర్ఎస్ కోసం ప్రజల నుంచి ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో రుణమాఫీకి రూ.31 వేల కోట్లు సమీకరించుకున్నట్లు చెప్పారని, రూ.20 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసినట్లు ఒప్పుకున్నారని వెల్లడించారు. శాసన సభలో బడ్జెట్‌పై చర్చను హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఏడాది బడ్జెట్ రూ.2 లక్షల 91 వేల 159 కోట్లు అని గొప్పగా చెప్పుకున్నారు. ఇవి అవాస్తవిక అంచనాలని నేను ఆనాడే చెప్పాను. వారు కాదు పొమ్మన్నరు. రివైజ్డ్ ఎస్టిమేషన్‌లో రూ.27 వేల కోట్లు తక్కువ చేసి చూపారు. ముఖ్యమంత్రేమో రూ.60 నుంచి రూ.70 వేల కోట్లు తక్కువగా వస్తాయని స్వయంగా చెప్పారు. అంటే అంచనా అవాస్తవం అని తేలిపోయింది. ఈ కొటేషన్ ఎవరు చెప్పారోగానీ కాంగ్రెస్ కోసమే చెప్పారు. ఎన్నికలకు ముందు మార్పు పేరిట వాగ్దానాలు ఇచ్చారు. ఎన్నికలు అయ్యాక ఆ వాగ్దానాలనే ఏమార్చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వడ్డీ లేని రుణాలకు సంబంధించి ఈరోజు వరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేసింది లేదు. వడ్డీ లేని రుణాల పరిమితిని గత ప్రభుత్వంలో మేం ఇచ్చిన 5లక్షలకు మించి పెంచింది లేదు. ఇదే శాసనసభలో మేము అడిగిన ప్రశ్నకు సమాధానంగా 5లక్షల వరకే వడ్డీ అందుతుందని ప్రభుత్వమే స్పష్టంగా చెప్పింది. 5లక్షల వరకే వడ్డీ లేని రుణాలు అని మీరే అన్నరు. మళ్లీ మీరే తీసుకున్న మొత్తం రుణానికి వడ్డీ లేని రుణం అని ప్రచారం చేసుకుంటున్నరు. నేను భట్టి గారిని సూటిగా అడుగుతున్నా. మహిళా సంఘాలు తీసుకున్న మొత్తం రుణానికి వీఎల్ఆర్ వర్తిస్తుంది అనే ఉత్తర్వులు ఉంటే చూపండి. లేదా ఈ సభను తప్పుదోవ పట్టించినందుకు, మహిళా లోకాన్ని మోసం చేసిందనందుకు భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నా. ఎకరానికి రూ.15 వేలు చెల్లిస్తామన్న సంకల్పం ఏమైంది. రైతులు, కౌలు రైతులకు రైతు భరోసా, రైతు బీమా ఇస్తామని చెప్పారు. ఇప్పుడు కౌలు రైతులను రైతులే చూసుకోవాలంటున్నారు. ఈసారి బడ్జెట్‌లో అసలు కౌలు రైతుల ప్రస్తావనే లేదు. మహిళా సంఘాలకు స్కూల్ యూనిఫామ్స్ కుట్టుకూలీ రూ.50 నుంచి రూ.75కు పెంచి ఇచ్చినట్లు చెప్పారు. రూ.75 కుట్టు కూలీ ఇచ్చిన మహిళా సంఘం పేరు చెప్పాలని లేకపోతే క్షమాపణ చెప్పాలి. ఇందిరమ్మ ఇండ్లకు నిధులు కేటాయించినట్లు చెప్పారు. కాంగ్రెస్ పాలనలో 4.5 లక్షల ఇండ్లు కాదు కాదా.. 4 ఇండ్లు కూడా కట్టలేదు. ఎస్సీ, ఎస్టీల ఇండ్లకు రూ.లక్ష అదనంగా కలిపి రూ.6 లక్షలు ఇస్తామన్నారు. ఈ సారి ప్రసంగంలో రూ.లక్ష మాయమైంది. దళిత, గిరిజనులను ప్రభుత్వం మో సం చేశారు. ఫసల్ బీమాకు రూపాయి ఇవ్వలేదని, ఫసల్ బీమా చేయట్లేదు. జాబ్ క్యాలెండర్.. జాబ్‌లెస్ క్యాలండర్ అయింది. ట్రిపుల్ ఆర్ ఉత్తరభాగానికి మా ప్రభుత్వ హయాంలో అనుమతులు తెచ్చామన్నారు. భూసేకరణకు రూ.1,525 కోట్లు పెట్టామని గత బడ్జెట్‌లో చెప్పారు. ఏడాదైనా ఒక్క ఎకరా సేకరించలేదు, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఆరు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తామని గత బడ్జెట్‌లో చెప్పారు, ఎన్ని ప్రాజెక్టులు పూర్తిచేసి.. ఎంత ఆయకట్టుకు నీళ్లిచ్చారో చెప్పాలి. ఆటో డ్రైవర్లకు రూ.12 వేలు, పంటలకు బోనస్ ఇస్తామని మోసం చేశారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, విద్యార్థులకు భరోసా కార్డు పేరుతో మోసం చేశారు. ఆదాయం పెంచి హామీలు నెరవేరుస్తామని ఎన్నికలకు ముందు చెప్పారు. కాంగ్రెస్ వైఫల్యం వల్ల రాష్ట్ర ఆదాయంపై ప్రభావం పడింది. రాష్ట్ర ఆదాయం క్షీణిస్తున్న సమయంలో ఏం చేయాలో భట్టి విక్రమార్క చెప్పాలి. ప్రభుత్వ వైఫల్యాలు సరిచేసుకోవాలి లేదా రేవంత్‌రెడ్డి ఫార్ములా ప్రకారం భూములు అమ్మాలి. ఎనుముల వారి పాలనలో ఎన్ని భూములు ఖతం పట్టిస్తారో తెలియదు. గచ్చిబౌలిలో 400 ఎకరాల భూముని వేలం చేయడం ద్వారా రూ.30 వేల కోట్లు రాబట్టాలని నిర్ణయించారు. టీజీఐఐసీ భూములు తాకట్టుపెట్టి రూ.10 వేల కోట్లు అప్పు తెచ్చారు. హెచ్ఎండీఏ భూములు తాకట్టుపెట్టి రూ.20 వేల కోట్లు అప్పు తెస్తామని చెప్పారు. ఆ రోజు ఫార్మాసిటీకి మేము భూములు సేకరిస్తుంటే ఆ రోజు అక్కడ భట్టి విక్రమార్క, సీతక్క పాదయాత్ర చేసి భూములు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు.

### విచారణకు ఆదేశించిన కలెక్టర్

హైదరాబాద్,అధికారుల నిర్లక్ష్యంతో మెయిన్ పరీక్షల్లో కొన్నిసార్లు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈక్రమంలో పదోతరగతి పరీక్షలు ప్రారంభమైన తొలిరోజే అధికారుల నిర్లక్ష్యం బయటపడింది. ఎగ్జామ్‌సెంటర్ పరీక్ష రాయటానికి కూర్చున్న విద్యార్థులకు ఒక ప్రశ్నా పత్రానికి బదులు మరో ప్రశ్నాపత్రాన్ని ఇవ్వడంతో విద్యార్థులు షాక్‌కు గురయ్యారు. మంచిర్యాల జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో దాదాపు రెండు గంటలు ఆలస్యంగా పదో తరగతి పరీక్షలు మొదలయ్యాయి. ఉదయం విద్యార్థులంతా పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష హాల్లో తమకు కేటాయించిన సీట్లలో కూర్చుకున్నారు. పరీక్షలు రాసేందుకు సిద్ధమయ్యాయి. అక్కడి ఇన్విజిలేటర్లు ప్రశ్నాపత్రాన్ని విద్యార్థులకు ఇచ్చారు. అయితే ఆ ప్రశ్నాపత్రాన్ని చూసి విద్యార్థులంతా అవాక్కయ్యారు. ఏంటిది అంటూ ఒకింత భయాందోళనకు గురయ్యారు. ఒక ప్రశ్నాపత్రానికి బదులుగా మరో పేపర్‌ను అధికారులు పంపిణీ చేశారు. విద్యార్థులు దాన్ని గుర్తించి చెప్పడంతో అధికారులు హైరానా పడ్డారు. హడావుడిగా మరో పేపర్ తెప్పించడంతో దాదాపు రెండు గంటలు ఆలస్యంగా విద్యార్థులు పరీక్ష రాశారు. అయితే ప్రశ్నాపత్రం తారుమారైన విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లింది.

# లండన్‌లో ఎన్నారైలతో చిరు భేటీ

హైదరాబాద్,మెగాస్టార్ చిరంజీవికి మరో అరుదైన పురస్కారం లభించిన సంగతి తెలిసిందే. ప్రఖ్యాత లండన్ బ్రిడ్జ్ ఇండియా సంస్థ మెగాస్టార్ కు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించింది. అంతే కాకుండా యునైటెడ్ కింగ్‌డమ్ హౌస్ ఆఫ్ కామన్స్‌లో అక్కడి ఎంపీలు మినిస్టర్లు, ఇతర ఎన్నారైలు చిరంజీవిని సత్కరించారు. ఈ సందర్భంగా చిరంజీవి లండన్ లో ఉన్న తెలుగు వారితో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. 'మీతో మాట్లాడుతుంటే నా కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్నట్టే ఉంది. మీరంతా ఎప్పుడో ఒక టైమ్ లో నా సినిమాలను లేదా పాటలను విని స్పందించే ఉంటారు. మీ మాటలు నా దాకా చేరుతూనే ఉన్నాయి. ప్రపంచంలో ఉన్న తెలుగు వాళ్లతో కలవాలని ఎప్పుడూ ఎదురు చూస్తుంటాను' అన్నారు. మీరందరూ నా అన్నదమ్ములు, అక్కా తమ్ముళ్ల లాంటి వారు. మీ అందరి ఇంటికి వచ్చి నా చెల్లెమ్మ చేతి వంటలు తినాలని ఉంది. ఆ అవకాశం ఎప్పుడు వస్తుందో తెలియదు. కచ్చితంగా ఆ అవకాశం త్వరలోనే రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. నాకు భేషజాలు లేవు. నేను సినిమాల్లో అనుకున్న స్థాయికి వచ్చాను. నా తమ్ముడు పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో నా ఆశలను కొనసాగిస్తున్నాడు. అతనికి మనందరి ప్రేమ అవసరం ఉంది. మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం' అంటూ చిరంజీవి చెప్పుకొచ్చారు. గత రెండు రోజులుగా చిరంజీవి యుకెలో పర్యటిస్తుండగా, తెలుగు వారితో, ఫ్యాన్స్‌తో ముచ్చటిస్తూ ఆసక్తికర విషయాలు పంచుకుంటున్నారు. ఇక ఇదే సమయంలో ప్రధాని మోదీతో మాట్లాడిన విషయాలని కూడా గుర్తు చేసుకున్నారు.. పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేగా గెలిచి ప్రమాణ స్వీకారం చేసిన రోజు స్టేజిపై పవన్ మోదీని చిరంజీవి దగ్గరికి తీసుకెళ్లి మాట్లాడించడం మనం చూశాం. అందుకు సంబంధించిన వీడియోలు ఎన్ని వైరల్ అయ్యాయో. ఆ రోజు చిరు కళ్లలో సంతోషం మనం ఎన్ని వేల కోట్లు- ఇచ్చినా కొనలేనిది.ఇక అదే సందర్భంలో చిరంజీవి, పవన్ కళ్యాణ్ , మోదీ కలిసి మాట్లాడుకున్న విజువల్స్ వైరల్ అయ్యాయి. అయితే తాజాగా యూకే ఫ్యాన్స్ మీట్ లో చిరంజీవి ఆ రోజు మోదీ తనతో ఏం మాట్లాడారో వివరించారు. ఆ రోజు మోదీ గారు మాట్లాడిన మాటలు నాకు ఇంకా గుర్తు ఉన్నాయి.. ఎమ్మెల్యేగా పవన్ గెలిచి నా ఇంటికొచ్చిన వీడియో మోదీ చూశారు. తమ్ముడిని ఆప్యాయంగా, ఆశీర్వదించిన తీరు ఆయన హృదయాన్ని తాకిందని, అది చూసి కన్నీళ్లు కూడా వచ్చాయని మోదీ చెప్పారని చిరంజీవి స్పష్టం చేశారు. అన్నదమ్ములు ఎలా ఉండాలో మీరు చూపించారని ఆయన మెచ్చుకున్నారు అంటూ మెగాస్టార్ తెలిపారు. ఈ విషయాన్ని గతంలో సోషల్ మీడియాలో పంచుకున్న చిరంజీవి ఇప్పుడు యూకే ఫ్యాన్స్ ముందు చెప్పారు.

## తెలంగాణ పరువును ఢిల్లీ బజారులో పెట్టారు

హైదరాబాద్,శాసన మండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వర్సెస్ మంత్రి సీతక్క మధ్య మాటల యుద్ధం జరిగింది. ముఖ్యమంత్రి రాష్ట్రం పరువు తీస్తున్నారని కవిత చేసిన వ్యాఖ్యలకు మంత్రి సీతక్క ఘాటుగా స్పందించింది. రాష్ట్ర పరువు తీసింది మీరని కవితని ఎదురు ప్రశ్నించారు. మా కుటుంబమే రాష్ట్ర పరువు తీసిందా.. మాకు ఢిల్లీ వ్యాపారాలు తెలియవు.. ఢిల్లీ వ్యాపారాలతో రాష్ట్ర పరువు తీసింది మీరు, మీ కుటుంబం అని మండిపడింది. కాంగ్రెస్ పార్టీది త్యాగాల చరిత్ర. కరప్షన్ కి కేర్ ఆఫ్ అడ్రస్ బీఆర్ఎస్.. మహిళలకు అడుగడుగున అన్యాయం చేసింది టీ-ఆర్ఎస్.. మొదటి ఐదు సంవత్సరాల్లో మంత్రి పదవిలో మహిళలు లేరు, మహిళా కమిషన్ కి సభ్యులు లేరు.. మహిళలు పొదుపు చేసుకున్న 1800 కోట్ల అభయ హస్తం నిధులు ఇవ్వలేదు.. పావలా వడ్డీ ఇవ్వలేదు.. మహిళ సంఘాలకు ఇవ్వాల్సిన రూ. 3700 కోట్ల వడ్డీలు చెల్లించలేదు అని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేసారు. తెలంగాణను మీరు సస్యశ్యామలం చేస్తే, రైతులు ఎందుకు ఇబ్బందులు పడ్డారని మంత్రి సీతక్క ప్రశ్నించింది. మేము పంట కాలువలు మూసివేసినట్లు-గా టీ-ఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తుంది.. బీఆర్ఎస్ పార్టీ డీఎన్ఏ లోనే కరప్షన్ ఉంది.. ఇష్టానుసారంగా ఎస్టిమేషన్స్ పెంచి దోచుకుతున్నారు.. మీరు నోటిఫికేషన్లు ఇస్తే నియామకాలను ఎవరు అడ్డుకున్నారు అని అడిగారు. మీరు చేయలేని ఉద్యోగాల భర్తీ మేం చేస్తున్నాం.. 59 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం.. మీరు అన్ని చేస్తే ప్రజలు ఎందుకు ఓడిస్తారు.. టీ-ఆర్ఎస్ పెద్దలు ఆత్మ పరిశీలన చేసుకోవాలని తెలిపింది. మీరు బంఫర్ మెజారిటీ-తో అధికారంలోకి రాలేదు.. మీరు మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు 63 సీట్లతో వచ్చారు అని తెలిపింది. మేము 65 సీట్లతో అధికారులకు వచ్చాం.. 10 ఏళ్లలో ఎన్ని ఇండ్లు ఇచ్చారని అడిగింది. ప్రజలకు ఇండ్లు ఇవ్వలేదు కాబట్టి మిమ్మల్ని ప్రజలు ఇంట్లో కూర్చోబెట్టారు.. మేము వచ్చి 15 నెలలు అయింది.. అప్పుడే అన్ని కావాలన్నట్టు-గా అక్కసు వేల కక్కుతున్నారు అని మండిపడింది. అయితే, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలు దేశం కోసం ప్రాణాలు అర్పించారు.. వారి పేరు స్కీమ్స్ కి పెడితే ఎందుకంత కడుపు మంట అని ఎమ్మెల్సీ కవితను మంత్రి సీతక్క ప్రశ్నించింది. మీరు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇవ్వలేదు.. ఎన్నో హామీలు తుంగలో తొక్కారు.. రాష్ట్రం పరువు తీసింది మీరే.. తప్పుడు ప్రచారం చేయొద్దు.. ఎఫ్ఆర్బీఎం నిబంధనలకు విరుద్ధంగా అప్పుల కోసమే కార్పొరేషన్లను ఏర్పాటు- చేశారు.. మీరు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది అని మంత్రి సీతక్క చెప్పుకొచ్చారు.

# సత్యానికి ఓటమి తాత్కాలికమే !

(ఆధ్యాత్మికచింతన )తిరుమల, సత్యానికి తాత్కాలిక ఓటమి ఉంటుంది. అయితే శాశ్వత కీర్తిని మాత్రం పొందుతుంది. మన పురాణాలు, ఇతిహాసాలు, వేదాలు ఇదే చెబుతున్నాయి. సత్యం మరచిన వారు సమాజంలో అరచకాలకు పాల్పడతారు. సత్యం,ధర్మాలను మనం ఆచరిస్తే అవి మనలను కాపాడుతాయి. అందుకే ఈ రెంటినీ విడవకుండా జీవనం సాగించాలి. మహాభారతంలోని ఉ ద్యోగ పర్వంలోసత్యం, ధర్మం తెలిసి కూడా ఆచరణలో పెట్టలేని కౌరవులకు మళ్లి ఒకసారి గుర్తు చేయడానికే కూర్చబడినట్టు పండితులు చెబుతారు. కృష్ణపరమాత్మ కౌరవ పాండవుల మధ్య సంధి చేయ కౌరవ సభకు వచ్చి యుద్ధం నివారింప బడాలని చెబుతూ పాండవులు అయిదుగురికి ఐదు ఊర్లు ఇచ్చినా సంతృప్తిపడ తారని కౌరవులకు నచ్చజెప్ప ప్రయత్నించాడు. అయినా కౌరవులు పరమాత్ముని వచనాలు పెడచెవిన బెట్టడమేగాక కృష్ణ భగవాణున్ని సామాన్యునిగా భావించి బంధించ ప్రయత్నించారు. అసత్యపరులు అహంకారులు తనను తెలుసుకోలేని అజ్ఞానులని భావించిన భగవానుడు తన విశ్వ రూపాన్ని ప్రదర్శించి తనెవరో తెలియజేసాడు. ప్రస్తుత కాలంలో విజ్ఞానపరంగా మనం ఎంతో అభివృద్ధిని సాధించాం. సాధిస్తున్నాం కూడా! కానీ సత్యం, న్యాయం, ధర్మం వంటి వాటిపై శ్రద్ధ చూపడం లేదనేది ముమ్మాటికి నిజం. సత్య ధర్మాలపై అశ్రద్ధ కారణంగానే మనం ప్రకృతి వైపరీత్యా లకు గురవుతున్నాం. ప్రాణాలను పణంగా పెట్టుకుంటున్నాం. ఇకనైనా మనం మేలుకొని సత్యంతో కూడిన ఆలోచనలు, ఆచర ణలు ఆచరించ ప్రయత్నిద్దాం. సత్యంలోనే భగవంతుడు న్నాడని నమ్మడంతో పాటు ఆచరణలోకి తేవాలి. అప్పుడే మనిషి సుఖశాంతులతో జీవించగలడు.

# పార్లమెంట్‌లో మంత్రుల హామీలు 75 శాతం అమలుకు నోచుకోలేదా?



న్యూఢిల్లీ,పార్లమెంట్ సమావేశాల సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు, లేవనెత్తిన సమస్యలకు పరిష్కారం లభిస్తుందా? మంత్రులు సభా వేదికగా ఇచ్చిన హామీలు ఎంత వరకు నెరవేరుతున్నాయి సాధారణంగా అందరికీ వచ్చే అనుమానమే ఇది. కానీ, దీనిపై ఖచ్చితమైన లెక్క ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజూజీ అన్నారు.ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యులు సంజయ్ సింగ్ రాజ్యసభలో అడిగిన ప్రశ్నతో ఆసక్తికరంగా మంత్రులు ఇచ్చిన హామీల లెక్కలు బైటికొచ్చాయి. ప్రశ్నోత్తరాల, ఇతర చర్చల సందర్భంగా కేంద్ర మంత్రులు ఇచ్చిన హామీలు ఆటోమేటిక్‌గా నమోదు చేసుకొని, వాటిని ఫాలో చేసే పద్ధతిని నరేంద్ర మోదీ ప్రభుత్వం 2018 నుంచి తీసుకొచ్చింది. అయితే, ఆప్ సభ్యులు సంజయ్ సింగ్ మార్చి 17న సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రులు సభలో ఇచ్చిన హామీలలో 75 శాతం పరిష్కారానికి నోచుకోవడంలేదన్నారు. అంతేకాకుండా పార్లమెంట్ వ్యవహారాల శాఖ ఇచ్చిన సమాచారమే నిదర్శనమని చెప్పారు. 2024లో సభలో ఇచ్చిన 160 హామీలలో 39 మాత్రమే నెరవేర్చబడ్డాయని, 119 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

### పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి స్పందన..

2018లో ఆన్‌లైన్ హామీల పర్యవేక్షణ వ్యవస్థ ఓఏఎంఎస్ ప్రారంభించిన తర్వాత, 99% అభ్యర్థనలు పరిష్కరించబడ్డాయని మంత్రి కిరణ్ రిజూజీ తెలిపారు. చాలా తక్కువ సంఖ్యలో హామీలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. మూడు నెలలలోపు అన్ని హామీలను నెరవేర్చకపోతే, అది పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై మచ్చ అవుతుందని ఆయన అన్నారు."పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ప్రాముఖ్యతను మేము అర్థం చేసుకున్నాము. పార్లమెంటు సభ్యులు ప్రశ్నలు అడిగితే, ప్రభుత్వం స్పందిస్తే, ఆ హామీని నెరవేర్చడం చాలా ముఖ్యం. అవి నెరవేరకపోతే, అది పార్లమెంట్ ప్రజాస్వామ్యంపై మచ్చ అవుతుంది" అని మంత్రి ఘాటుగానే ప్రతిస్పందించారు. మూడు నెలల్లోపు హామీపై ప్రతిస్పందించాలని, పార్లమెంటు సభ్యుల లేఖలకు ఒక నెలలోపు సమాధానం ఇవ్వాలని తాము అందరు మంత్రులకు లేఖలు పంపినట్టుగా మంత్రి వెల్లడించారు. తాము వాటిని తేలికగా తీసుకోలేమని అన్నారు.

### ఆప్ ఆరోపణలు..

99% హామీలు నెరవేర్చబడ్డాయని మంత్రి చెప్పిన సమాధానంలో నిజం లేదని, ఎందుకంటే వారి వెబ్‌సైట్‌లో 1,324 హామీలు పెండింగ్‌లో ఉన్నాయని చూపిస్తోందని ఆప్ సభ్యులు సింగ్ అన్నారు. ఈ నేపథ్యంలో సింగ్ వ్యాఖ్యలపై ఆసక్తికరంగా చర్చ సాగింది. సభ్యులు ఏ వెబ్సైట్ చూశారని మంత్రి ప్రశ్నించారు. 1947 నుంచి లెక్కలు చెబుతున్నారంటు చమత్కరించారు.అయితే, రాజ్యసభలో 547 హామీలు పెండింగ్‌లో ఉండగా, లోక్‌సభలో 764 హామీలు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి లెక్కలు చెప్పారు. డిజిటల్ వేదికగా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ లోక్‌సభ, రాజ్యసభ సెక్రటేరియట్‌లతో సంయుక్తంగా అమలు చేసిన ఓఏఎంఎస్ ప్రకారం చూసుకోవచ్చనారు. పార్లమెంట్‌లో మంత్రులు చేసిన హామీలను క్రమపద్ధతిలో ట్రాక్ చేయడం, పర్యవేక్షించడం , నెరవేర్చడం లక్ష్యంగా ఉన్న డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఓఏఎంఎస్ అని అన్నారు. ఈ వ్యవస్థ వచ్చాక జవాబుదారీతనం, పారదర్శకత, సామర్థ్యాన్ని పెంచిందని మరో మంత్రి ఎల్ మురుగన్ వెల్లడించారు.

### ఆన్లైన్ ఎసూరెన్స్ మానిటరింగ్ సిస్టం ఏంచేస్తుంది?

పార్లమెంట్ ఉభయసభలలో జవాబుదారీతనాన్ని పెంచడానికి, పారదర్శకత కోసం 2018లో ఆన్‌లైన్ హామీల పర్యవేక్షణ వ్యవస్థ ఓఏఎంఎస్‌ను తీసుకు వచ్చారు. పార్లమెంట్ ఉభయసభలు లోక్‌సభ, రాజ్యసభలలో ప్రశ్నోత్తరాల సమయం తరువాత జరిగిన చర్చలలోనూ మంత్రులు శాఖల వారీగా ఇచ్చిన హామీలను ఈ సిస్టం ఆటోమేటిక్‌గా రికార్డు చేస్తుంది. మూడు నెలలలోపు వాటిపై ఆ మంత్రిత్వ శాఖ స్పందించాలి. ఆ పరిష్కారం పూర్తి అయ్యిందా లేదా, లేకపోతే ఎందుకు అన్న విషయాలను ఓఏఎంఎస్‌లో నమోదుచేస్తారు.అంతేకాకుండా మంత్రులు ఇచ్చిన హామీలను తగిన సమయంలో గుర్తు చేస్తుంది కూడా. తాజాగా వెబ్సైట్ సూచిస్తున్న లెక్కలు చూస్తే మొత్తం మీద 33,722 హామీలు ఇచ్చినట్లు చూపిస్తోంది. అందులో 28,227 హామీలు అమలుకు నోచుకున్నాయని, 2623 హామీలు అసంబద్ధమైనవిగా గుర్తించి తొలగించారని, ప్రస్తుతం 1,263 హామీలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు చూపిస్తోంది.అలాగే, లోక్‌సభలో ఇచ్చిన హామీలు, రాజ్యసభలో ఇచ్చిన హామీల లెక్కలను విడివిడిగా కూడా వెబ్సైట్ సూచిస్తోంది. లోక్‌సభలో 2024లో 252 హామీలు, 2025లో ఇప్పటి వరకూ 20 హామీలు ఇచ్చారు. లోక్‌సభలో 2019లో అత్యధికంగా 1061హామీలు ఇచ్చినట్లు అధికారిక వెబ్సైట్ సూచిస్తోంది. అదే రాజ్యసభలో 2024లో 160 హామీలు, 2025లో ఇప్పటి వరకూ 17 హామీలు ఇచ్చారు. రాజ్యసభలో మాత్రం అత్యధికంగా 2018లో 415 హామీలు ఇచ్చారు.పార్లమెంట్ పరంగా అమలవుతున్న ఓఏఎంఎస్ సిస్టం రాష్ట్రాల అసెంబ్లీల పరిధిలో అమలు కావడంలేదు. అయితే సభలో సభ్యులు అడిగిన, లేవనెత్తిన సమస్యల పరిష్కారం కోసం మంత్రులు ఇచ్చిన హామీలు అమలయ్యాయా లేదా లెక్కలతో చూపిస్తున్న కేంద్రం ఎన్నికల హామీలను కూడా ఎప్పటికప్పుడు ఎన్ని అమలయ్యాయో లెక్కలతో సహా ప్రజల ముందుకు తెస్తే బాగుంటుంది.రాష్ట్ర అసెంబ్లీలలోను ఇలాంటివి రావాలి. ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేస్తున్నామని అధికార పార్టీలు చెప్తున్నాయి. అమలు కావడం లేదని ప్రతిపక్షాల ఆరోపిస్తున్నాయి. ఆరోపణలు ప్రత్యారోపణలు చేసుకోవడం సహజంగా మారింది. తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కూడా ఇదే సీన్ తరచుగా కనిపిస్తోంది. తాజాగా బడ్జెట్ సమావేశాలు హీట్ పుట్టించాయి.

## తిరుమల కొండలకు ఆనుకుని నిర్మాణాలు

తిరుపతి,తిరుమల కొండలకు ఆనుకుని ఎలాంటి నిర్మాణాలకు అనుమతి లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. గతంలో ఇచ్చిన పలు అనుమతులను రద్దు చేసింది. తిరుపతిలోని అలిపిరి వద్ద ఏర్పాటు చేసే ముంతాజ్ హోటల్ నిర్మాణానికి ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనుమతి రద్దు చేశారు.

# డీలిమిటేషన్ త్రిశంకు స్వర్గంలో ఆంధ్రప్రదేశ్

హైదరాబాద్,కొన్నిరోజుల క్రితం నేను రూ.1044 పెట్టి అమెజాన్‌లో ఒక వస్తువు కొన్నాను. ఆ బిల్లులో అసలు ధర రూ.883, జీఎస్టీ టాక్స్ రూ.161 అని ఉంది. అంటే నా కష్టార్జితం 15% మించి టాక్స్ రూపంలో ఈ ప్రభుత్వానికి ఇస్తున్నాను. జీఎస్టీ కాబట్టి అది నేరుగా కేంద్ర ప్రభుత్వం చేతిలోకి వెళ్తుంది. నా డబ్బు రూ.161 నుంచి నేను బతుకుతున్న రాష్ట్రానికి వాళ్ళు కేవలం రూ.50 ఇచ్చి రూ.111 నొక్కేస్తున్నారు. అది అధిక జనాభా, పేదరికం పేరుతో ఏ బీహార్‌కో, యూపీకో పోతుంది. మన రాష్ట్రంలో పేదలు లేరాని నాకు సందేహం.ప్రజల అవసరార్థం వారికి సదుపాయాలు కల్పించే నిమిత్తం ప్రభుత్వాలు ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తాయి. నేను తెలంగాణ రాష్ట్రంలో ఉంటూ ఇక్కడి ప్రభుత్వం అందించే అభివృద్ధి, సౌకర్యాలు(అరకొర అయినప్పటికీ) అనుభవిస్తూ ఇక్కడ నా అవసరాలు తీర్చే నా రాష్ట్ర ప్రభుత్వానికి ఈ వస్తువు ద్వారా రూ. 50 నేను చెల్లించేది. కానీ నాకు ఏ సంబంధమూ లేని, అసలు జీవితంలో ఒక్కసారి కూడా అక్కడికి వెళ్లే అవసరమే లేని ఉత్తరాది రాష్ట్రాలకు రూ.111 నేను ఇస్తున్నాను. ఎంత అన్యాయం!!మనం నిత్యం ఎన్నో వస్తువులు కొంటాం. అయితే, జీఎస్టీ పేరుతో దక్షిణాది రాష్ట్రాలను నిలువునా దోచేస్తున్నారు. ఉత్తరాది ప్రజల్ని పోషించే దౌర్భాగ్యపు స్థితి నుంచి బయటపడి మనం కట్టే పన్నుల సొమ్ము మనమే ఉపయోగించుకుంటే అది మన రాష్ట్రంలోని పేదల సంక్షేమానికీ, అభివృద్ధికీ దోహదపడటమే కాదు, పన్నుల భారం తగ్గి తద్వారా వస్తువుల తక్కువ ధరలు తగ్గి మన జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.

### పెనం నుంచి పొయ్యిలోకి..


వివక్షతో, జీఎస్టీ పేరుతో బీజేపీ దక్షిణ భారత దేశాన్ని ఇప్పటికే పెనం మీద వేసి కిందా మీదా వేయించుతుంది. అయినా నోరు మూసుకుని భరిస్తున్నారని కాబోలు ఇప్పుడు ఆ పెనాన్ని కూడా లాగి డీలిమిటేషన్(నియోజక వర్గాల పునర్విభజన) పేరుతో డైరెక్ట్‌గా పొయ్యిలోకి తోసే ప్రయత్నం చేస్తోంది. దక్షిణ రాష్ట్రాలు అన్నీ ఏకమై ఒకే మాట మీద ఈ దౌర్జన్యానికి అడ్డుకట్ట వేయకపోతే దక్షిణాది ప్రజలకు భవిష్యత్తే ఉండదు. ఉత్తరాది ఆధిపత్యాన్ని ప్రశ్నించే అవకాశమే లేక ఆ నియంతృత్వానికి లొంగిపోయి బానిసలుగా బతకడం తప్ప గత్యంతరం ఉండదు.ప్రస్తుతం దక్షిణ భారత రాష్ట్రాలు ఇంతటి విషమ పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ఇటువంటి సమయంలో కేరళ, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్టాలు ఏకమై బీజేపీ దౌర్జన్యాన్ని ప్రతిఘటిస్తున్నాయి. కానీ బాధ్యత లేకుండా ఏపీ ప్రభుత్వం మాత్రం బీజేపీ అరాచకానికి వంత పాడుతూ రాష్ట్ర ప్రజల భవిష్యత్తుని హారతి పళ్లెంలో పెట్టి మరీ బీజేపీ చేతికి అందించి భజన చేస్తుంది.

### ఒకే తాటిపై నిలబడ్డ కాంగ్రెస్ సీఎంలు..

కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నాయి. తమది జాతీయ పార్టీ కాబట్టి డీలిమిటేషన్, నూతన విద్యావిధానాలను వ్యతిరేకిస్తే ఉత్తరాది ఓట్లకు గండిపడే అవకాశముందనే భయం కేంద్రంలోని ఆ పార్టీకి ఉండొచ్చు. అయినప్పటికీ రాష్ట్ర ప్రయోజనాలు, దక్షిణాది ప్రజల భవిష్యత్తే ముఖ్యమని ఈ ఇద్దరు ముఖ్యమంత్రులు గట్టిగానే నిలబడ్డారు. 'మాకు హిందీ అవసరం లేదు. మాకు మా తెలుగే ముఖ్యం'అని జాతీయ మీడియాకు రేవంత్ రెడ్డి స్పష్టంగా చెప్పారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌ను మెచ్చుకోకుండా ఉండలేము.

### హిందీ కుట్రలకు ఏపీలో రెడ్ కార్పెట్..

కానీ చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ ఈ ముగ్గురూ మాత్రం స్వార్థ ప్రయోజనాల కోసం బీజేపీతో అంటకాగుతున్నారు. ఇందులో భాగంగా బీజేపీ డీలిమిటేషన్, హిందీ కుట్రలకు రెడ్ కార్పెట్ వేసి మరీ స్వాగతం పలుకుతున్నారు.




రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయినంత మాత్రాన తన, తన కొడుకు, తన మీడియా, తన బంధువర్గాల అవసరాల కోసం ఏపీలోని కోట్లాది ప్రజల ఆత్మగౌరవాన్నీ, భవిష్యత్తునూ, తెలుగు భాష, సంస్కృతులను బీజేపీ కాళ్ళ ముందు పడేసే అధికారం చంద్రబాబుకు ఎవరిచ్చారు? ఇక పీకేని విమర్శించాలంటే ఇప్పుడున్న తెలుగు పదాలు సరిపోవు, కొత్తవి కనిపెట్టాలి. ద్రావిడ ప్రజలకు ఈ ముగ్గురూ చేస్తున్న ద్రోహానికి, వీళ్ళను తిట్టడానికి ప్రజలకు మూడు భాషలు కూడా సరిపోవని కాబోలు పది భాషలు తెస్తారట.హిందీ వద్దంటేనే, బీజేపీని ప్రశ్నిస్తేనే దేశ ద్రోహులు అయిపోతున్నారే. మరి ద్రావిడుల ఆత్మగౌరవం కోసం, ఉనికి కోసం చేసే పోరాటంలో దక్షిణాది ఐక్యతకే భంగం కలిగిస్తూ, ఛిన్నాభిన్నం చేస్తూ దక్షిణాది ప్రజలందరికీ సామూహిక వెన్నుపోటు పొడుస్తున్న ఈ ముగ్గురిని ఏమనాలి? ఒకవేళ దక్షిణ దేశ ద్రోహులు అంటే అది చాలా చిన్న మాటే అవుతుంది.

### జగన్ మౌనం ఎందుకు?

ఇక ఏపీ ప్రతిపక్ష పార్టీ వైసీపీ విషయానికి వస్తే, గతంలో అన్నిటికంటే తమకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. కానీ ఇప్పుడు ఈ డీలిమిటేషన్ కారణంగా ఫెడరల్ వ్యవస్థ ధ్వంసంతో రాష్ట్రం మట్టి కొట్టుకుపోయే పరిస్థితి వచ్చింది. అయినా నోరు మెదపకుండా ఇంకా మౌనంగా ఎందుకు ఉన్నారు? ఇంతటి క్లిష్ట పరిస్థితిలో పార్టీలకు అతీతంగా దక్షిణాది నాయకులంతా ఏకమై అన్యాయాన్ని ప్రతిఘటిస్తుంటే ఈయన మాత్రం ఇంకా మీనమేషాలు లెక్కపెడుతూ రాజకీయ లెక్కలు వేసుకుంటూ కూర్చుంటే దానిని ప్రజలు ఎందుకు క్షమించాలి? రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం అడుగులు వేయాలా వద్దాని ఆలోచిస్తూ కూర్చునే నాయకులని ప్రజలు ఎందుకు గౌరవించాలి?గత అయిదేళ్లలో ఏపీలో విద్యావైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు, అభివృద్ధిని జగన్ సాధించారు. సామాన్య ప్రజల కోసం పని చేసి, ప్రజల్లో గౌరవాన్ని పొందారు. అటువంటి వైఎస్ జగన్ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపునిచ్చిన అఖిల పక్షసమావేశానికి మద్దతు తెలపకపోతే, పై ముగ్గురిలాగే దక్షిణదేశ ద్రోహుల జాబితాలో చేరక తప్పదు.అంతేకాకుండా, అప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజల పరిస్థితి మరీ దారుణంగా తయారవుతుంది. ఏపీని అడ్డం పెట్టుకుని బీజేపీ తన లక్ష్యం వైపు అడుగులు వేసే అవకాశాన్ని జగన్ మరింత సులభతరం చేసినట్టవుతుంది. అదే జరిగితే దక్షిణ భారతీయులు ఎవ్వరూ వైసీపీ అధినేత జగన్‌ను క్షమించరు.అలాకాకుండా స్టాలిన్‌కు మద్దతుగా నిలబడి, పోరాటంలో భాగమైతే, బీజేపీతో కలిసి నీచ రాజకీయాలు చేస్తున్న రాష్ట్ర అధికార పార్టీ నాయకుల దుర్మార్గాన్ని ప్రజల అండతో సునాయాసంగా ఎదురుకోవచ్చు. అప్పుడు రాష్ట్ర ప్రయోజనమే కాదు దక్షిణదేశ ప్రయోజనానికి వైఎస్ జగన్ పాటుపడినవారవుతారు.

# ఎస్సీ వర్గీకరణపై ఏపీ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

అమరావతి, ఎస్సీ వర్గీకరణపై ఏపీ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేయడం చారిత్రక విజయమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ ఏకగ్రీవ తీర్మానంలో చంద్రబాబుదే కీలక పాత్ర అన్నారు. 1997-98లో తొలిసారి తీర్మానం ప్రవేశపెట్టిన ఘనత చంద్రబాబుదేనన్నారు. ఈ విజయం 30 ఏళ్ల పోరాటంలో అమరులైన వారికి అంకితం చేస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. మా ఉద్యమంలో న్యాయం ఉందనేందుకు ఏకగ్రీవ తీర్మానాలే నిదర్శనం. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా చంద్రబాబు న్యాయం వైపే నిలబడ్డారు. ఇచ్చిన మాట కోసం ఆయన అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 1996లో మహాసభకు వచ్చి ఎస్సీ వర్గీకరణకు తొలిసారి హామీ ఇచ్చారు. ఎస్సీ వర్గీకరణ కోసం చంద్రబాబు చిత్తశుద్ధితో కృషిచేశారు. చంద్రబాబు తల్లి ఆశీస్సులు తీసుకొని 1997లో పాదయాత్ర ప్రారంభించా. మోదీ, అమిత్ షా, వెంకయ్య, కిషన్ రెడ్డి.. మాకు అండగా నిలిచారు. మాదిగల ఉద్యమాన్ని గుర్తుచేస్తూ పవన్ కల్యాణ్ కూడా మద్దతు ఇచ్చారు. జగన్ అధికారంలో ఉంటే గనక ఎస్సీ వర్గీకరణను ఇక చూసేవాళ్లం కాదు. కనీసం వినతిపత్రం ఇచ్చేందుకూ జగన్ మాకు అనుమతి ఇవ్వలేదు. ఎస్సీ వర్గీకరణపై తమ అభిప్రాయాన్ని వైకాపా ఇంకా చెప్పలేదు. చంద్రబాబు చతురత వల్లే తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. ఎస్సీ వర్గీకరణ విషయంలో చంద్రబాబు సామాజిక న్యాయం చేశారని కొనియాడారు.

# వైకాపాలో పొమ్మనలేక పొగపెట్టారు

అమరావతి, మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత విడదల రజిపై మాజీ ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీలో గుర్తింపు లేదు.. తనను చులకనగా చూశారని ధ్వజమెత్తారు. శుక్రవారం మర్రి రాజశేఖర్ మీడియాతో మాట్లాడుతూ.. రజినీని బలోపేతం చేయడానికి తనను అవమానించారని మండిపడ్డారు. త్వరలో టీడీపీలో చేరుతానని మర్రి రాజశేఖర్ స్పష్టం చేశారు. వైసీపీ నుంచి తాను వెళ్లిపోవడానికి వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి వైఖరీనే కారణమని అన్నారు. తనకు మంత్రి పదవి ఇస్తామని ఇవ్వలేదని మర్రి రాజశేఖర్ చెప్పారు. 2023 చివర్లో ఎమ్మెల్సీ ఇచ్చారని మర్రి రాజశేఖర్ గుర్తుచేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోయిన రజినీని చిలకలూరిపేట ఇన్‌చార్జ్‌ని చేశారని చెప్పారు. వైసీపీకి మర్రి రాజశేఖర్ రాజీనామా చేయడంపై మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత విడదల రజినీ స్పందించారు. మర్రి రాజశేఖర్ ఆత్మ విమర్శ చేసుకోవాలని విడదల రజనీ అన్నారు. మర్రి కుటు-ంబానికి వైఎస్ కుటు-ంబం ఎంతో గౌరవం ఇచ్చిందని తెలిపారు. మర్రి గెలుపు కోసం వైఎస్సార్ ప్రచారం చేశారని గుర్తుచేశారు. రెడ్‌బుక్ పాలనలో తన వాయిస్ వినిపించి ఉంటే.. మర్రి గౌరవం ఇంకా పెరిగి ఉండేదని అన్నారు. జగన్మోహన్ రెడ్డి చెబితేనే తాను గుంటూరు వెస్ట్ నుంచి పోటీ- చేశానని విడదల రజినీ తెలిపారు. మర్రి రాజశేఖర్ రాజీనామా ఏపీ రాజకీయాల్లో ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఎమ్మెల్సీకి రాజీనామా చేసిన తర్వాత ఆయన శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజును కలిసి రాజీనామా పత్రాన్ని అందజేశారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని మండలి ఛైర్మన్‌ను మర్రి రాజశేఖర్ కోరారు. వైసీపీకి రాజీనామా చేసిన ఆయన త్వరలో టీ-డీపీలో (ఃఉ) చేరుతున్నట్లు- ప్రకటించిన విషయం తెలిసిందే. రాజీనామాకు ముందు రాజశేఖర్‌ను వైసీపీ అగ్రనేతలు బుజ్జగించేందుకు ప్రయత్నించారు. రాజీనామాను ఉపసంహరించుకోవాలని ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ కోరారు. అయితే తాను టీ-డీపీలో చేరడానికి నిర్ణయం తీసుకున్నానని మర్రి రాజశేఖర్ అన్నారు.

# వివేకా హత్య కేసు విచారణలో కీలక పరిణామం

హైదరాబాద్,మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణపై తెలంగాణ హైకోర్టులో వివేకా కుమార్తె సునీత పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో ఆమె సీబీఐని ప్రతివాదిగా చేర్చారు. సీబీఐ కోర్టులో తన తండ్రి హత్య కేసును రోజువారీగా విచారించేలా ఆదేశించాలని పిటిషన్‌లో ఆమె కోరారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ప్రత్యేక ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రస్తుతం ఈ కేసు సీబీఐ కోర్టులో విచారణలో ఉన్న విషయం తెలిసిందే. ఇప్పటికే దాదాపు నాలుగేళ్లుగా ఈ కేసు విచారణ కొనసాగుతున్నా.. పురోగతి ఏమీ లేదని సునీత తన పిటిషన్‌లో పేర్కొన్నారు. హైకోర్టులో విచారణ సందర్భంగా సునీత తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. 2019 మార్చి 14న అర్ధరాత్రి ఈ హత్య చోటు-చేసుకుందని.. సీబీఐ అధికారులు విచారణ చేపట్టి ఇప్పటికే రెండు ఛార్జిషీట్‌లు దాఖలు చేశారన్నారు. ఇంకా సీబీఐ కోర్టులోనే విచారణ కొనసాగు తోందని.. దీన్ని ఆరు నెలల్లోగా ముగించేలా కోర్టును ఆదేశించాలని హైకోర్టును కోరారు. సీబీఐ అధికారులు ఇప్పటికే కొన్ని పత్రాలకు సంబంధించి హార్డ్ డిస్క్‌లో ప్రతివాదుల తరఫు న్యాయవాదులకు ఇచ్చారనీ.. అయితే, హార్డ్‌డిస్క్‌లో ఉన్న కాపీలు ఓపెన్ కావడంలేదు గనక నేరుగా ప్రింటింగ్ ప్రతులు కావాలని వారు కోరిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే, లక్షల సంఖ్యలో పేజీలు ఉండటంతో ప్రింటింగ్‌కాపీలు ఇవ్వడం కుదరదు గనక హార్డ్ డిస్క్‌లను ఓపెన్ చేయాలని సీబీఐ అధికారులు చెబుతుండటంతో.. దాదాపు 15 నెలలుగా విచారణ ముందుకు సాగడంలేదని సునీత న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే, సునీత ప్రధానంగా సీబీఐ అధికారులతో పాటు- తన తండ్రి హత్య కేసులో నిందితులుగా ఉన్నవారందరినీ ప్రతివాదులుగా చేర్చారు. ఈ అంశంపై విచారణ జరిపిన ప్రత్యేక ధర్మాసనం సీబీఐతో పాటు- ఈ కేసులో నిందితులందరికీ నోటీ-సులు వ్యక్తిగతంగా నోటీ-సులు ఇచ్చేందుకు సునీత న్యాయవాదికి అనుమతి ఇచ్చింది. ఈ కేసు తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

# మూసీ ప్రక్షాళనకు నిధుల విడుదల చేయండి

న్యూఢిల్లీ,మూసీ ప్రక్షాళన, మురుగునీటి శుద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించాలని మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ కోరారు. పార్లమెంట్ లో మాట్లాడిన ఆయన.. శుభ్రమైన తాగునీటి కోసం తెలంగాణకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంలో పట్టణీకరణ వేగంగా పెరిగిపోతుండటంతో.. నీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఇక, పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వాలు తగినంత మౌలిక సదుపాయాలు, సేవలను అందించడంలో ఇబ్బంది పడుతున్నాయని పేర్కొన్నారు. ఈ సవాళ్లను గుర్తించి కేంద్రం స్మార్ట్ సిటీ-స్, అమృత్ పథకాల కింద నిధులు ఇవ్వడం ఎంతో ప్రశంసనీయమైందన్నారు.

# అప్పట్లో హడావిడి చేసి.. ఇప్పుడెందుకు సైలెంట్ అయినట్లు?



హైదరాబాద్,అనేక అంశాల్లో హైడ్రా లక్ష్యం ఏంటో ఇప్పుడు ఏం చేస్తుందో అర్థం కాని పరిస్థితి ఉంది.హడలెత్తించింది.. కొన్నాళ్లుగా హాట్ టాపిక్‌గా మారింది. ప్రారంభించిన నెల, రెండు నెలలు వరకు హైడ్రా చేసిన హల్‌చల్ అంతాఇంతా కాదు. ఏమైందో ఏమో కానీ ఇప్పుడు హైడ్రా సైలెంట్ అయిందన్న చర్చ జరుగుతోంది. హైడ్రా స్పీడ్ అయినప్పుడు చెప్పిన మాటలకు, ఇప్పుడు చేస్తున్న పనులకు పొంతన లేకుండా పోతుందనే విమర్శలు ఉన్నాయి. సినీ హీరో నాగార్జున ఎన్.కన్వెన్షన్ నేలమట్టం చేసి పబ్లిక్ దృష్టిని ఆకర్షించింది హైడ్రా. ఆ తర్వాత ఓల్డ్ సిటీలో ఒక ఎమ్మెల్సీ నిర్మాణం కూల్చివేశారు.దాంతో హైడ్రాకు ఒక్కసారిగా మద్దతు పెరిగింది. ఇక చందానగర్ సర్కిల్..నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్..దుండిగల్ మున్సిపల్ పరిధిలో.. అన్ని అనుమతులు ఉ న్న నిర్మాణాలను కూడా హైడ్రా అధికారులు కూల్చివేశారు. కూకట్‌పల్లి నల్లచెరువు దగ్గరలోని అమీన్‌పూర్‌లో పేదలు, మధ్య తరగతి కుటుంబాలు లోన్లు పెట్టి కొన్న ఇండ్లను కూల్చివేసి హైడ్రా తీవ్ర విమర్శల పాలైంది.ఒకటి రెండు అంశాల్లో హైడ్రాకు మద్దతు లభించినా..ఆ తర్వాత హైడ్రా తీరుపై వ్యతిరేకత వ్యక్తం అవుతూ వస్తోంది. ప్రతిపక్ష పార్టీలు హైడ్రా చర్యలను తీవ్రంగా ఖండించాయి. హైడ్రా అధికారుల తీరును మొదట్లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎండగట్టారు. బీజేపీ ఈటల రాజేందర్ కూడా పేదల ఇళ్లను కూల్చడంపై తీవ్రంగా స్పందించారు. ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ అయితే ట్యాంక్ బండ్, సెక్రటేరియట్, హైడ్రా ఆఫీస్ కూడా బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ జోన్‌లో ఉ ంది కూలుస్తారా అంటూ హైడ్రాను నిలదీశారు.

**హైడ్రాపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత**

విమర్శలు వచ్చిన సందర్భాల్లో హైడ్రా స్పందించిన తీరు ఇంకా విమర్శలకు దారి తీసింది. నివాసం ఉంటున్న ఇళ్లను కూల్చివేయడంతో హైడ్రాపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అయింది. దాంతో చెరువులు నాళాల పరిధిలో కట్టిన నిర్మాణాల్లో అప్పటికే పబ్లిక్ ఉంటే వాటిని కూల్చమంటూ చెప్పుకొచ్చారు. చట్టం ప్రకారం తాము ముందుకు వెళ్తామని చెప్పిన హైడ్రా కమిషనర్ ఆ తర్వాత ఎందుకు వెనక్కి తగ్గారనే దానిపై చాలా డౌట్స్ వ్యక్తం అవుతున్నాయి.అయితే పేదలను కూల్చివేసిన హైడ్రా అధికారులు..కొన్ని నిర్మాణాలపై ఫిర్యాదులు చేసినా పట్టించుకోకుండా పర్మిషన్లు ఉన్నవాటి జోలికి వెళ్లబోమంటే చెప్పడం విమర్శల పాలు చేసింది. ఆయా సందర్భాల్లో వస్తున్న పొలిటికల్ ప్రెజర్స్ ప్రకారం హైడ్రా పనిచేస్తూ పోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు పబ్లిక్. ఇక ఇటీవల జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హైడ్రాపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఫిర్యాదు చేస్తే ఎకనాలెడ్జ్‌మెంట్ ఇవ్వడం లేదని తాను చేసిన ఫిర్యాదుల్ని పట్టించుకోవడం లేదంటూ ఆరోపించారు. ఇలా ప్రతిపక్షాలే కాదు అధికార పక్షం కూడా రంగనాథ్ ఆరోపణలు, విమర్శలు ఫేస్ చేస్తున్నారు.ఇక ప్రజలు ప్రజాప్రతినిధులు మాత్రమే కాదు హైకోర్టు కూడా పలుమార్లు హైడ్రా తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అమీన్‌పూర్ దగ్గర నిర్మాణాల కూల్చివేతకు తహశీల్దార్‌కు తాము సహకరించాము అని హైడ్రా కమిషనర్ చెప్పిన వ్యాఖ్యపై సీరియస్‌గా రియాక్ట్ అయింది కోర్టు. చాంద్రాయణగుట్ట తహశీల్దార్ అడిగితే హైకోర్టును కూల్చడానికి కూడా సహకరిస్తారా అంటూ హైడ్రాను సూటిగా ప్రశ్నించింది. సెలవు రోజుల్లో కూల్చివేతలు ఏంటంటూ ప్రశ్నించింది. పలు సందర్భాల్లో హైడ్రా అధికారులు నేరుగా కోర్టుకు హాజరు కావాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ఇలానే వ్యవహరిస్తే జీవో 99 ను రద్దుచేసి హైడ్రాను మూసి వేయడానికి ఉత్తర్వులు ఇవ్వాల్సి వస్తుందని కూడా హెచ్చరించింది.

**హైడ్రాను నిలదీసిన హైకోర్టు**

ఇక లేటెస్ట్‌గా మీరాలం చెరువు దగ్గరలో అక్రమ నిర్మాణంలో మీ నివాసం ఉ ందని దానిని కూల్చివేయాల్సి ఉందంటూ ఫాతిమా అనే మహిళకు తహశీల్దార్ నోటీసులు జారీ చేయడంపై హైకోర్టు సీరియస్ అయ్యింది. పేద మధ్యతరగతి వారే మీ టార్గెట్టా అని హైడ్రాను హైకోర్టు నిలదీసింది. ఈ రాష్ట్రంలో ప్రముఖులకు ప్రత్యేక చట్టం ఏమైనా ఉందా అంటూ సందేహం వ్యక్తం చేసింది. మియాపూర్ చెరువు ఆక్రమణల పరిస్థితి ఏంటి అంటూ హైకోర్టు సూటిగా హైడ్రాను ప్రశ్నించింది. అందరికీ ఒకేలా న్యాయం జరిగేలాగే హైడ్రా ఏర్పాటుకు అర్థం ఉంటుందని..హైడ్రా పనితీరు ఆశాజనకంగా లేదని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అభిప్రాయం వ్యక్తం చేసింది. హైడ్రా చేస్తున్న పనులు చాలా బాగున్నాయి అంటూ నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ప్రత్యేకంగా ప్రెస్ మీట్లు పెట్టి మరీ కొందరు చెబుతుండటం వెనుక హైడ్రా అధికారుల హస్తం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశంలోనూ హైడ్రాపై హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. మురికివాడల్లో అక్రమ నిర్మాణాలను కూల్చివేసే పత్రికల్లో ఫోటోలు వేయించుకోవడం కాదు దుర్గం చెరువు మియాపూర్ చెరువుల్లోని సంపన్నుల ఆక్రమణలు తొలగించినప్పుడే ప్రజా ప్రయోజనాలను పరిరక్షించినట్లు అవుతుందని కోర్టు స్పష్టం చేసింది.ఇలా అనేక అంశాల్లో హైడ్రా లక్ష్యం ఏంటో ఇప్పుడు ఏం చేస్తుందో అర్థం కాని పరిస్థితి ఉంది. మొదట పబ్లిక్ నుంచి రియాక్షన్ రాగా వారికి కొందరు లీడర్ల వాయిస్ యాడ్ అయింది. ఇప్పుడు ఏకంగా హైకోర్టే హైడ్రా తీరును తప్పుబట్టడం చూస్తుంటే..ఏదో చేద్దామనుకుంటే ఏదో అయిందన్న చర్చ నడుస్తోంది. కోర్టు ఆగ్రహంతోనైనా హైడ్రా తీరు మారుతుందా.? లేక ఇలాగే వ్యవహరిస్తుందా అనేది చూడాలి మరి.

# తాము పార్టీ మారలేదంటున్న జంపింగ్ ఎమ్మెల్యేలు..



హైదరాబాద్,తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేల ఎపిసోడ్ క్లైమాక్స్‌కు చేరుకుంటోంది. బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుపై గెలిచి.. కాంగ్రెస్ గూటికి చేరిన పది మంది ఎమ్మెల్యేల పరిస్థితి గమ్మత్తుగా మారింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ చేస్తోన్న న్యాయపోరాటం ఆల్‌మోస్ట్ చివరి స్టేజ్‌కు వచ్చింది.రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శితో పాటు, 10 మంది ఎమ్మెల్యేలకు, కేంద్ర ఎన్నికల సంఘానికి గతంలోనే నోటీసులు జారీ చేసింది కోర్టు. నోటీసుల ప్రకారం ఈనెల 22లోపు కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది. మార్చి 25న ధర్మాసరం విచారణ జరపనుంది.అయితే ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై ఇప్పటి వరకు సుప్రీంకోర్టులో జరిగిన వాదనలు చూస్తే పార్టీ జంపింగ్ ఎమ్మెల్యేలకు గట్టి ఎదురుదెబ్బ తగిలే అవకాశం కనిపిస్తోంది. దీంతో సుప్రీం ఏం తీర్పు చెప్పబోతుందోనన్న ఉత్కంఠ కొనసాగుతోంది. అఫిడవిట్లు దాఖలు చేయడానికి సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు 22 డేట్ దగ్గర పడుతుండటంతో పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డ ఆ పది మంది ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా అఫిడవిట్లు దాఖలు చేస్తున్నారట.

**రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశామంటూ..**

తాము పార్టీ మారలేదని అఫిడవిట్‌లో పేర్కొంటున్నట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశామే తప్ప కాంగ్రెస్ పార్టీలో చేరలేదని చెబుతున్నారట. సీఎం రేవంత్ రెడ్డిని కలిస్తే మీడియా దాన్ని వక్రీకరించి తాము పార్టీ మారినట్టుగా చూపించిందని సుప్రీంకోర్టులో దాఖలు చేస్తున్న అఫిడవిట్‌లో మెన్షన్ చేస్తున్నారట జంపింగ్ ఎమ్మెల్యేలు. తాము ఇప్పటికీ బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నామని, కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నారని సమాచారం.ఇప్పటికే పార్టీ ఫిరాయించిన ముగ్గురు ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారట. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తాను సమర్పించిన అఫిడవిట్‌లో పార్టీ ఫిరాయించలేదని, కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు వచ్చిన వార్తలు అవాస్తవమని, బీఆర్ఎస్ పార్టీతో తనకు మంచి అనుబంధం ఉందని చెప్పుకొచ్చినట్లు సమాచారం.శాసనసభకు మూడోసారి ఎన్నికయ్యాక వ్యక్తిగత స్థాయిలో సీఎం రేవంత్ రెడ్డిని కలిశానని చెప్పుకొచ్చిన మహిపాల్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీలో చేరలేదని సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారట. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన ఫిరాయింపు ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, కాలె యాదయ్య కూడా ఇదే విధంగా..తాము పార్టీ మారలేదని, బీఆర్ఎస్ లోనే ఉన్నామని సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసినట్లు చర్చ జరుగుతోంది.

**మరికొందరు ఎమ్మెల్యేలు కూడా..**

వీళ్లు ముగ్గురే కాకుండా బీఆర్ఎస్ పార్టీ నుంచి అధికార కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన మరికొందరు ఎమ్మెల్యేలు కూడా ఇలానే అఫిడవిట్లు వేస్తున్నారట. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీ నుంచి చేయి గుర్తుపై సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేశారు. దీంతో ఆయన బీఆర్ఎస్‌తో సయోధ్య కుదుర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే హైడ్రాను వ్యతిరేకించడంతోపాటు అసెంబ్లీ సాక్షిగా అధికార కాంగ్రెస్‌ను ఇరకాటంలో పెట్టేలా మాట్లాడరన్న చర్చ జరుగుతోంది.ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శి, కేంద్ర ఎన్నికల సంఘం అఫిడవిట్లలో ఏం చెప్పబోతున్నారనేది కూడా ఆసక్తికరంగా మారింది. సుప్రీంకోర్టు విచారణ తీరు చూస్తోంటే మాత్రం విషయం కాస్త సీరియస్‌గా ఉందన్న చర్చ జరుగుతోంది. మరి ఎమ్మెల్యేలు దాఖలు చేసిన అఫిడవిట్లపై ఈ నెల 25న అత్యున్నత న్యాయస్థానం ఎలాంటి తీర్పు ఇవ్వబోతోందన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. బీఆర్ఎస్ పార్టీ మాత్రం కచ్చితంగా ఆ పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడుతుందని, ఆ పది సీట్లకు ఉప ఎన్నికలు ఖాయమని ధీమా వ్యక్తం చేస్తోంది.అయితే అఫిడవిట్లు ఫైల్ చేస్తున్న ప్రకారం సదరు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోనే ఉన్నట్లు. మరి ఆ సభ్యులను బీఆర్ఎస్ పార్టీ తిరిగి తమ గూటికి చేర్చుకుంటుందా లేదా అనేది కూడా చర్చనీయాంశంగా మారింది. మరోవైపు జంపింగ్ ఎమ్మెల్యేలు తాము బీఆర్ఎస్‌లోనే ఉన్నామని చెప్పడం కాంగ్రెస్‌కు షాక్ ఇచ్చినట్లేనన్న టాక్ వినిపిస్తోంది. అనర్హత భయంతోనే అలా అవిడవిట్లు వేస్తున్నా వాళ్లు ఇప్పటికే హస్తం పార్టీలో అసంతృప్తిగా ఉన్నారన్న చర్చ జరుగుతోంది. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత జంపింగ్ ఎమ్మెల్యేల సెంట్రిక్‌గా పొలిటికల్ డెవలప్‌మెంట్స్ ఎలా ఉంటాయో చూడాలి మరి.

# ఉగాది నుంచి తెల్లరేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం



హైదరాబాద్,రాష్ట్రంలోని తెల్ల రేషన్‌కార్డుదారులకు ఉగాది నుంచి రేషన్ షాపులలో సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు ప్రకటించింది. ఉగాది రోజున హుజూర్ నగర్ నియోజకవర్గంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంబించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఉగాది రోజు ఉత్తమ్ కుమార్ రెడ్డి సతీసమేత ంగా మటంపల్లి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో పూజ అనంతరం సన్నబి య్యం పంపిణీ ప్రారంభిస్తారని తెలిపారు. మటంపల్లి ఆలయంలో పంచాంగ శ్రావణ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. కాగా రాష్ట్రంలోని అన్ని రేషన్ షాపుల్లో ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీని చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీని మటంపల్లిలోనే సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేలా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ఇందుకోసం స్థల ఎంపికకు చర్యలు తీసుకున్నామని, అన్ని వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని పేద, దిగువ మధ్య తరగతి వర్గాల కోసం చారిత్రక నిర్ణయం తీసుకునే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో ఆహార భద్రత కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు ప్రకటించింది. కుటుంబంలో ఎంత మంది ఉంటే ఒకొక్కరికీ 6 కిలోల చొప్పున అందజేస్తారు. అయితే, ప్రస్తుతం పంపిణీ చేస్తున్న దొడ్డు బియ్యం తినడానికి అనువుగా ఉండడం లేదు. రేషన్‌కార్డుదారుల్లో దాదాపు 85 శాతం మంది ఆ బియ్యాన్ని కిలోకు రూ.10 చొప్పున బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుని, సన్న బియ్యం కొనుక్కుంటున్నారు. ఆ బియ్యాన్ని మరింతగా పాలిష్ చేసి, సన్న బియ్యంగా మార్చడం ద్వారా దళారులు భారీగా లాభపడుతున్నారు. దీంతో రేషన్‌కార్డుదారులకు దొడ్డు బియ్యం బదులుగా సన్న బియ్యం ఇస్తే.. నూటికి నూరు శాతం మంది తినడానికి వినియోగించుకుంటారని ప్రభుత్వం భా విస్తోంది. అది కూడా ఉచితంగా ఇస్తే పేదలకు ఉపయోగకరంగా ఉండడంతోపాటు సర్కార్‌కు మంచి పేరు వస్తుందన్న ఆలోచన చేసింది. ఈ నిర్ణయంతో బహిరంగ మార్కెట్‌లో మేలిమి రకం సన్న బియ్యం ధరలు సైతం దిగొస్తాయని అంచనా వేస్తోంది. ప్రస్తుత వానాకాలంలో పండిన సూపర్ ఫైన్ బియ్యాన్నే రేషన్ షాపుల్లో పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# నేను ఆర్డర్స్ ఇస్తే.. కేటీఆర్ ఇంటి తలుపులు పగలగొట్టి.. సీఎం స్ట్రాంగ్ వార్నింగ్



హైదరాబాద్, టెంపర్‌మెంట్‌లో తగ్గేదేలే.. అంటూ సీఎం రేవంత్‌రెడ్డి తేల్చి చెప్పేశారు. 20 ఏళ్లైనా రాజకీయాల్లో తన టెంపర్‌మెంట్ మార్చుకోలేదని.. మార్చుకోబోనని అన్నారు. ట్రాన్స్‌ఫార్మ్ కావాలని కొందరు తనకు సలహాలిస్తున్నారు కానీ.. తాను హుందాగా ఉంటే అర్థం చేసుకునే వాళ్లు ఉ ండాలిగా అంటూ కొట్టిపడేశారు. సీఎంగా ఉంటూ రేవంత్‌రెడ్డి అలా మాట్లాడు తారా అంటూ ఇన్నాళ్లు కేటీఆర్, హరీశ్ రావులు చేస్తున్న బ్లేమ్ గేమ్‌పై ఇలా సూటిగా, సుత్తి లేకుండా కౌంటర్ ఇచ్చారు. తాను మారేదే లేదని.. టెంపర్‌మెంట్ తగ్గించుకునేదే లేదని తేల్చిపడేశారు రేవంత్. ముఖ్యమంత్రిగా విజడమ్‌లో తన స్కిల్ అప్‌గ్రేడ్ చేసుకుంటున్నానని చెప్పారు.సీఎం రేవంత్ రెడ్డి చాలా కూల్‌గా.. స్మూత్‌గా.. కేటీఆర్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. రొటీన్‌కు భిన్నంగా ఏమాత్రం ఆవేశపడకుండా.. ఏమాత్రం ఉగ్రరూపం ప్రదర్శించకుండా.. చాలా పొలైట్‌గా తాను తలుచుకుంటే ఏం చేయగలనో చక్కగా వివరించి హెచ్చరించారు. తెలంగాణ గరం.. నరం.. బేషరం.. అనే నానుడు ఉందని గుర్తు చేశారు. రాజకీయాల్లో మొదటి పదేళ్లు గరం గరంగా ఉంటారని.. మరో పదేళ్లు నరం.. ఆ తర్వాత పదేళ్లు బేషరంగా బతుకుతారనే సామెత సరికాదన్నారు. తాను మరో పదేళ్లు సీఎంగా ఉన్నా.. ఇంతే పవర్‌ఫుల్‌గా ఉంటానని తేల్చి చెప్పారు.

**కేటీఆర్ వీపు పగలకొట్టించలేనా?**

సోషల్ మీడియాలో తనపై, తన సర్కారుపై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని తప్పుబట్టారు సీఎం రేవంత్ రెడ్డి. పాలనపై పట్టు లేదని, ప్రజల్లో కోపం ఉ ందంటూ సోషల్ మీడియాలో బీఆర్ఎస్ పెయిడ్ పోస్టులతో చేస్తున్న న్యూసెన్స్‌పై మండిపడ్డారు. ఆనాడు ప్రొఫెసర్ కోదండరాం ఇంటి తలుపులు పగలగొట్టినట్టు.. ఇప్పుడు కేటీఆర్ ఇంటి తలుపులు పగలగొట్టి.. వీపు పగలకొట్టించలేనా? అని సూటిగా ప్రశ్నించారు. అప్పుడు ఉన్నది ఇదే పోలీసులు.. ఇప్పుడూ అదే అధికారులు ఉన్నారని గుర్తు చేశారు. సీఎంగా తాను ఆర్డర్స్ ఇస్తే పోలీసులతో కేటీఆర్‌ను, బీఆర్ఎస్ నేతలను అణిచివేయలేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను గడీల్లో పెరగకున్నా.. నల్లమల్ల అడవుల్లో క్రూర మృగాల మధ్య పెరిగానని.. ఏం తెలీకుండానే 20 ఏళ్లు ప్రతిపక్షంలో రాణించానా? అంటూ గట్టిగానే జవాబు చెప్పారు సీఎం రేవంత్‌రెడ్డి. రాజు అనే వాడు విజ్ఞతతో ఉండాలని తాను సహనం ప్రదర్శిస్తున్నా.. లేదంటేనా.. అంటూ వార్నింగ్ ఇచ్చారు ముఖ్యమంత్రి.

# రాజకీయ లబ్ది కోసమే హిందీ వివాదం



న్యూఢిల్లీ,:రాజకీయంగా లబ్ధి పొందేందుకు, అవినీతిని దాచి పెట్టేందుకే కొన్ని పార్టీలు భాష అంశాన్ని వివాదం చేస్తున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా దుయ్యబట్టారు. భాష పేరిట ఇప్పటికే దేశంలో చాలా వరకు విభజన వచ్చిందని, ఇకపై ఎంతమాత్రం జరగబోదని రాజ్యసభలో వ్యాఖ్యానించారు. దక్షిణాది భాషలకు కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకమని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని అమిత్‌షా మండిపడ్డారు. అలాగైతే తాను గుజరాత్ నుంచి, నిర్మలా సీతారామన్ తమిళనాడు నుంచి ప్రభుత్వంలో మంత్రులుగా ఎలా వ్యవహరిస్తున్నామని ప్రశ్నించారు. ఇంజినీరింగ్, మెడికల్ విద్యను తమిళంలో అందించాలని తమిళనాడు ప్రభుత్వానికి గత రెండేళ్లుగా కోరుతున్నా. దానివల్ల మీ ఆర్థిక ప్రయోజనాలు నెరవేరవని భయపడుతున్నారని డిఎంకెకు చురకలంటించారు. మేం అధికారంలోకి వస్తే మెడికల్, ఇంజినీరింగ్ విద్యను తమిళ భాషలోనే అందిస్తాంమని అమిత్‌షా అన్నారు. తమిళనాడు అసెంబ్లీకి వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. హిందీ ఏ భాషకూ పోటీ కాదని, అన్ని భాషలకూ సోదర భాష అని పేర్కొనారు. ఈ మేరకు రాజ్యసభలో ఆయన వివిధ అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య జాతీయ విద్యావిధానం, త్రిభాష అంశంపై వివాదం నెలకొన్న వేళ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కొన్ని పార్టీలు తమ సొంత రాజకీయ ప్రయోజనాల కోసం భాష అంశాన్ని వివాదం చేస్తున్నాయి. వారి అవినీతిని దాచుకునే ప్రయత్నిస్తున్నాయి. దేశంలోని అన్ని భాషలూ దేశానికి ఓ నిధి లాంటిది. హిందీ కూడా ఇతర భాషలకు సోదర భాషే అని అమిత్ షా అన్నారు. భాష పేరిట విభజన తీసుకొచ్చేందుకు చేపట్టే చర్యలేవీ ఫలించవన్నారు. మోదీ ప్రభుత్వం రాజ్యభాషా విభాగాన్ని ఏర్పాటు- చేసిందని చేశారు. తెలుగు, తమిళం, పంజాబీ, అస్సామీ.. ఇలా అన్ని భాషలనూ ప్రాచుర్యం కల్పించడం దీని ముఖ్య ఉ ద్దేశమని వివరించారు. ఇకపోతే ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదం పట్ల కఠిన వైఖరి అనుసరిస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. కశ్మీర్‌లో ఇప్పుడు సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయని, అక్కడి యువకులు ఉద్యోగాలు చేసుకుంటు-న్నారని తెలిపారు. సినిమాహాళ్లు నిండుతున్నాయని వెల్లడించారు. గత ప్రభుత్వాల పనితీరుపై మండిపడ్డారు. అవి ఉగ్రవాదుల పట్ల మెతకవైఖరి అనుసరించాయని దుయ్యబట్టారు. జమ్మూకశ్మీర్, ఈశాన్య భారతంలోని ఉగ్రవాదం, తీవ్రవాదం దేశ వృద్ధికి ఆటంకాలు. వాటి వల్ల 92వేల మంది ప్రాణాలు కోల్పోయారు. మోదీ ప్రభుత్వ పాలనలో జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం వల్ల మరణాలు 70 శాతం తగ్గాయి. ఉ గ్రఘటనలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ఆర్టికల్ 370ని రద్దు చేయడం ద్వారా 'ఒకే రాజ్యాంగం- ఒకే జెండా' అనే రాజ్యాంగ నిర్మాతల కలను మోదీ ప్రభుత్వం నెరవేర్చింది. ఇప్పుడు కశ్మీర్‌లో సాయంత్రం పూట కూడా సినిమాహాళు తెరిచే ఉంటు-న్నాయి. జీ20 సమావేశాలు జరిగాయి. 2019 నుంచి 2024 వరకు అక్కడి యువతకు 40వేల ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయి. స్వయం ఉపాధి పొందుతున్న వారి సంఖ్య, పెట్టు-బడులు పెరిగాయన్నారు. ఉరి, పుల్వామా ఘటనలు జరిగిన రోజుల వ్యవధిలో మెరుపు దాడులు, వైమానిక దాడులు చేసిన ఈ ప్రభుత్వం పాకిస్థాన్‌కు గట్టి బదులిచ్చింది. అలాగే మార్చి 31, 2026 నాటికి వామపక్ష తీవ్రవాదం అంతమవుతుంది. రాజకీయ భావజాలం మద్దతున్న ఉగ్రవాదాన్ని విస్తరించకుండా అడ్డుకుంటాం. అలాగే రూ.1.25 లక్షల కోట్ల విలువైన డ్రగ్స్‌ను సీజ్ చేశామని కేంద్రహోంశాఖ పనితీరుపై చర్చ సందర్భంగా అమిత్ షా వెల్లడించారు.

**బెట్టింగ్ యాప్ కేసు కొట్టేయండి**

హైదరాబాద్, బెట్టింగ్ యాప్‌ల కేసులో యాంకర్ శ్యామల తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. బెట్టింగ్ యాప్ కేసులో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని పిటిషన్ వేశారు. దీనిపై కోర్టులో విచారణ జరగనుంది. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినందుకు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో శ్యామలపై కేసు

# రాష్ట్రంలో కొత్తగా 70 బార్లు!



హైదరాబాద్, ఆదాయాన్ని రాబట్టుకోవడమే లక్ష్యంగా కొత్త బార్లకు అనుమతి ఇచ్చేందుకు ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. జనాభాతోపాటు రాబడి ఎక్కువగా ఉన్న ప్రాంతాలను ప్రాతిపదికగా తీసుకుని అనుమతులు ఇవ్వనున్నారు. ఈ మేరకు త్వరలో నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 70కిపైగా కొత్త బార్లు వచ్చే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే, ఎలైట్ బార్లకు అనుమతులివ్వడంతో పాటు మైక్రోబ్రూవరీల సంఖ్యను పెంచాలని ఎక్సైజ్ శాఖ యోచిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 1,171 బార్లు ఉండగా.. వీటిలో సగం వరకు హైదరాబాద్, సికింద్రాబాద్‌లోనే ఉన్నాయి. ఇవి కాకుండా 89 ఎలైట్ బార్లు, హైదరాబాద్, శంషాబాద్, జూబ్లీహిల్స్, బంజారా హిల్స్, మాదాపూర్ వంటి ప్రాంతాల్లో 55 పబ్బులు కొనసాగుతున్నాయి. గత ఏడాది (2024-25లో) ఎక్సైజ్ శాఖ నుంచి రూ.25,617.53 కోట్ల ఆదాయం రావాలని లక్ష్యం నిర్దేశించినా.. చేరుకోలేకపోయింది.అయితే, ఈ ఏడాది (2025-26లో) రూ.27,623.36 కోట్లు రాబట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే కొత్త బార్లకు అనుమతులు ఇచ్చే దిశగా ఎక్సైజ్ శాఖ అడుగులు వేస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చివరిసారిగా 2021 ఫిబ్రవరి మొదటి వారంలో కొత్త బార్ల ఏర్పాటుకు అవకాశం కల్పించారు. ఆ తర్వాత ఇప్పుడే తాజాగా కొత్త బార్ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానించబోతున్నారు. త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేసి, రెండు నెలల్లో కొత్త బార్లు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోనున్నారు. అలాగే, ఎలైట్ బార్లకు అనుమతులు ఇచ్చే విషయాన్నీ పరిశీలిస్తున్నారు. ఇందుకోసం రెగ్యులర్ లైసెన్స్ ఫీజు కంటే 25శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఉ దాహరణకు ఒక బార్‌కు లైసెన్స్ ఫీజు రూ.40లక్షలు ఉంటే.. ఎలైట్ బార్‌కు రూ.50లక్షలు చెల్లించాలి. గతంలో ఎలైట్ బార్ల ఏర్పాటుకు ఎప్పుడుపడితే అప్పుడు అనుమతి ఇచ్చేవారు. గత ప్రభుత్వంలో కొందరికి మాత్రమే అనుమతులు ఇచ్చి.. ఆ తర్వాత ఇవ్వలేదు. తాజాగా వీటికీ అనుమతులు ఇచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. అలాగే, రాష్ట్రంలో మైక్రో బ్రూవరీల సంఖ్యను 50కి పెంచాలని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది. ఢిల్లీ, బెంగళూరు, ముంబై, చైన్నై వంటి నగరాల్లో మైక్రోబ్రూవరీలు ఎక్కువగా ఉండగా.. హైదరాబాద్‌లో వాటి సంఖ్య పది లోపే ఉంది. ఈ నేపథ్యంలో వీటిని పెంచేందుకు కసరత్తు జరుగుతోంది.

**త్వరలో స్వదేశానికి మరికొంతమంది అక్రమ వలసదారులు**

న్యూఢిల్లీ, తాను గెలిస్తే అక్రమ వలసదారులను దేశం నుంచి సాగనంపుతానంటూ చేసిన శపథాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నెరవేర్చుకుంటున్నారు. అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వలసదారులపై కొరడా ఝుళిపిస్తున్నారు. ఇప్పటికే అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న పలు దేశాలకు చెందిన వారిని ప్రత్యేక విమానాల్లో స్వదేశాలకు పంపిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా వందలాది మంది భారతీయులను కూడా స్వదేశానికి తరలించారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com